ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
మంగళవారం 10 జూన్ 2025

తాళి కట్టబోయి తన్నులు తిన్నాడు..!
- విడాకులు ఇవ్వకుండానే రెండో పెళ్లికి సిద్ధమైన ఘనుడు
- గొడవకు దిగిన మొదటి భార్య
- పోలీసులకు అప్పగించిన వధువు తల్లిదండ్రులు
- చిక్కమగళూరు జిల్లాలో కలకలం రేపిన వివాహం

8

నరకాసురులు..!



- రెచ్చిపోతున్న వడ్డీ వ్యాపారులు
- అధిక వసూళ్లతో సామాన్యులను పీడిస్తున్న రాక్షసులు
- పట్టించుకోని అధికారులు

బెంగళూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రైవేట్ వడ్డీ వ్యాపారులు రెచ్చి పోతున్నారు. ఇష్టానుసారం వడ్డీలు వసూలు చేస్తూ సామాన్యులను పీడిస్తున్నారు. చట్టాలు, ప్రభుత్వ నిబంధనలు పట్టించుకోకుండా డైలీ, వారం, నెల వడ్డీల పేరుతో మధ్యతరగతి ప్రజలను వేధిస్తున్నాయి. మైక్రో ఫైనాన్స్‌ల నిర్వాహకులు తీవ్రంగా వేధిస్తున్నారని తద్వారా ఆత్మహత్యలు పెరిగాయని, వారి వేధింపులు భరించలేక సొంతూళ్లను వీడి పరారవుతున్నారనే నిత్యం ఆరోపణలు రావడంతో ప్రభుత్వం ఆ సంస్థల ఆగడాలకు చెక్‌పెట్టింది. పలు నిబంధనలతో కట్టడి చేసింది. మైక్రో సంస్థలు సన్నగిల్లడంతో ప్రైవేట్ వడ్డీవ్యాపారులు తమ కార్యకలాపాలకు యథేచ్ఛగా తెరతీశారు. ప్రభుత్వం మైక్రో సంస్థలపై పలు కఠిన నిబంధనలు విధించింది. ఉదయం నుంచి సాయంత్రంలోగానే అప్పులు వసూలు చేయాలని ఆంక్షలు విధించారు. రిజిస్ట్రేషన్ కలిగిన మైక్రో ఫైనాన్స్ సంస్థలు అప్పు ఇచ్చే ముందే అతడి ఆదాయం, ఆస్తులు పరిశీలించి ఇవ్వాలని, పరిమితి దాటితే అనుమతులు రద్దు చేసే నిబంధనలు ఉన్నాయి. దీంతో చిన్న వ్యాపారులు, కిరాణా దుకాణదారులు, అత్యవసర పరిస్థితుల్లో అవసరమైన వారు స్థానికంగా ఉండే వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ఇదంతా రహస్యంగా సాగే వ్యవహారం కావడంతో ప్రభుత్వం గుర్తించేందుకు వీలుండదు. అయితే పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు కొత్త కష్టాలు వచ్చినట్లయ్యింది. సాధారణంగా రుణాలు పొందాలంటే వాణిజ్యబ్యాంకులు, సహకారబ్యాంకులు, వ్యవసాయ పరపతి సంఘాలను ఆశ్రయించేవారు. ఈ సంస్థలలో అప్పు తీసుకోవాలంటే ఎందుకోసం అనేది ప్రాథమిక ప్రాధాన్యం ఉంటుంది. మరోవైపు ఆస్తులకు సంబంధించిన పత్రాలు, ఇతరత్రా రికార్డులు తాకట్టు పెట్టాల్సి ఉంటుంది. ఇటీవల కొన్నేళ్లుగా ప్రైవేట్ వ్యక్తులు వడ్డీ వ్యాపారం చేస్తున్నారు. వీరిలో కొందరు రిజిస్ట్రేషన్ కల్గిన సంస్థలుగాను మార్చుకున్నారు. వందకు 10శాతం కూడా గ్రామీణ ప్రాంతాల్లో వడ్డీలు ఇచ్చేవారు రిజిస్ట్రేషన్‌లు చేయించరు. అంతా నోటుబుక్కులు, రెవెన్యూ పేపర్ల పైనే రాతపోతలు సాగిస్తుంటారు.

ఫైనాన్స్ సంస్థలకు అనుమతులు తప్పనిసరి

రిజర్వ్‌బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ)లో రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలి. అనుమతులు పొందిన మైక్రో ఫైనాన్స్ సంస్థలు, ప్రైవేట్‌గా అప్పులు ఇచ్చేవారు జిల్లాస్థాయి ప్రాధికారలో పేర్లు నమోదు చేసుకోవాలని, వడ్డీ వ్యాపారుల వేధింపుల నియంత్రణ చట్టం తీసుకొచ్చారు. ఇప్పటివరకు మూడు జిల్లాల్లో సమాచారం సమగ్రంగా అందింది. అనధికారిక లావా దేవీలు జరిపి 500కుపైగా ప్రామిసరీ నోట్లు, 250ఖాళీ చెక్కులను మూడు జిల్లాల అధికారులు జప్తు చేశారు. కఠినమైన చట్టాలు అమలులో ఉన్నందున ప్రైవేట్ అప్పుల లావాదేవీలు తగ్గిపోతున్నాయి. మైక్రో ఫైనాన్స్ సంస్థలు ఆర్‌బీఐ విధించిన షరతులతో రుణాల లావాదేవీలపైనా పెనుప్రభావం చూపింది. ఒక వ్యక్తికి రూ.50వేలు చొప్పున, బ్యాంకుయేతర ఆర్థిక సంస్థలు రూ.2లక్షలకు మించి రుణం ఇచ్చేందుకు వీలు లేదు. అవసరమైన వారి ఆస్తులను పరిశీలించిన మైక్రో ఫైనాన్స్ సంస్థలు పరిమితికి మించి రుణాలు ఇవ్వడంతో వారిపై నిర్బంధం విధించారు. మైక్రో ఫైనాన్స్ సంస్థలు రుణగ్రహీతకు చెందిన సిబిల్‌స్కోర్ పరిశీలించి పరిమితిలోగా రుణం ఇస్తున్నారు. ఇలా ఎనలేని నిబంధనలతో రాష్ట్రంలో మైక్రో ఫైనాన్స్ సంస్థల అప్పుల లావాదేవీలు రూ.60వేల కోట్ల నుంచి 60శాతం తగ్గినట్టు తెలుస్తోంది. ఇది గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై పెను ప్రభావం చూపేలా ఉంది.

చట్టం అమలు చేయకముందు...

మైక్రో ఫైనాన్స్ నియంత్రణకోసం విధించిన చట్టం రాక ముందు రాష్ట్రంలో 7,063 ఫైనాన్స్‌సంస్థలు 6,772 పాన్ బ్రోకర్‌లు, 6,590 లావాదేవీలతో కలిపి 20,425 సంస్థలు రిజిస్ట్రేషన్ అయ్యాయి. ఆర్‌బీఐలో రిజిస్ట్రేషన్ కల్గిన 31 మైక్రో ఫైనాన్స్ సంస్థలు 3090శాఖల ద్వారా 37,967మంది సిబ్బంది పనిచేసేవారు. 1.09 లక్షల ఖాతాల ద్వారా 59,327.76 కోట్ల రూపాయలు చేసేవారు. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం మైక్రోఫైనాన్స్, బ్యాంకుయేతర ఆర్థిక సంస్థలు పనిచేస్తున్నాయి. రుణం లావాదేవీలు ఉత్తమంగా ఉండాలని పర్యవేక్షణకు ఎసా-ధన్, మైక్రో ఫైనాన్స్ ఇండస్ట్రీ నెట్‌వర్క్‌ను నియమించింది.

చట్టం ఉద్దేశం..

స్థిర, చరాస్తులు స్వాధీనం చేసుకోవడం, బెదిరింపులు, దౌర్జన్యాలతో రుణాల వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలు ఉండేవి. కర్ణాటక కిరుసాల (మైక్రో ఫైనాన్స్) చిన్న రుణాలపై బలవంతపు చర్యలు తీసుకోరాదని చట్టం చేశారు. మైక్రో ఫైనాన్స్‌తోపాటు వడ్డీవ్యాపారులు తీవ్రంగా వేధిస్తున్నారని, వారి ఆగడాలు భరించలేక, ఊళ్లు వదలడం, ఆస్తులు వదులుకోవడం, బంగారం ఇతరత్రా వంటివి నష్టపోతున్నారనే ఆరోపణలు రావడంతో ప్రత్యేకచట్టం తీసుకొచ్చారు. మైక్రోఫైనాన్స్, చిన్నరుణాలు, ప్రైవేట్ వ్యాపారులనుంచి వేధింపులు తప్పించి రక్షించేందుకే చట్టం తెచ్చారు. అప్పుల వసూళ్లలో దౌర్జన్యానికి పాల్పడినట్టు రుజువైతే రూ.5లక్షల జరిమానాతో పాటు పదేళ్ల జైలుశిక్షతో కలిపి రుణమాఫీ చేసే అవకాశం ఉంది. మైక్రోఫైనాన్స్‌ల వేధింపులు తీవ్రమయ్యాయనే విమర్శలు రావడంతో ప్రభుత్వ ఆదేశాలతో చీఫ్ సెక్రటరీ, జిల్లా అధికారులతో సమావేశం జరిపారు. మైక్రో ఫైనాన్స్ సంస్థల ప్రతినిధులు, ఆర్‌బీఐ అనుమతులు పొందాలని, అప్పుల వసూళ్ల విషయంలో సమయపాలన, అధికవడ్డీ వసూలు చేయరాదని, దౌర్జన్యం, బెదిరింపు లేకుండా ఉండేలా మైక్రో ఫైనాన్స్, ప్రైవేట్‌గా అప్పులు ఇచ్చేవారితో ప్రత్యేక సభ జరిపి, నిబంధనలు వివరించాలని చట్టంలో పేర్కొన్నారు.

మైక్రో ఆగడాలకు చెక్..

ఇటీవల దశాబ్దన్నర కాలంలో మైక్రో ఫైనాన్స్ సంస్థలు కుప్పలకొద్దీ వెలిశాయి. వీరు అప్పు ఇవ్వడం సులభతరమైనా ఎట్టి పరిస్థితుల్లోనూ వదలకుండా వసూలు చేయడంలో కఠినంగా ఉంటారు. సాధారణంగా రెండు మూడు పల్లెలకు ఒకరు చొప్పున వసూళ్లు చేస్తుంటారు. మొండి బకాయిలైతే ప్రత్యేక బృందాల రూపంలో ఇళ్ల వద్దకు వెళ్లి మకాం వేస్తారు. మర్యాదలేకుండా చేస్తామని హెచ్చరిస్తారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వసూలు చేసేదాకా వదలరు. మైక్రో ఫైనాన్స్‌లు రుణాలు ఇస్తున్నా, ప్రభుత్వం జారీ చేసిన నిబంధనలతో సంస్థలు ఆచితూచి వ్యవహరిస్తున్నాయి. దీంతో చిన్న వ్యాపారులు, సామాన్యవర్గాలు ప్రైవేట్ వ్యక్తుల వద్ద అప్పు తీసుకోవడం అనివార్యంగా మారింది. స్వల్పరుణాల వ్యవస్థ అయోమయంగా మారింది. మధ్యమవర్గం, మురివాడలలో నివసించేవారు, దినసరి కూలీలు వంటివారికి అప్పు పుట్టడమే కష్టంగా మారింది. గతంలో లోన్‌యాప్‌లో నమోదు చేసుకుని నిమిషాల వ్యవధిలో మూడో వ్యక్తికి తెలియకుండా అవసరానికి అప్పు పుట్టేదనే అభిప్రాయాలు ఉన్నాయి.

ఆలయాల్లో ప్లాస్టిక్ నిషేధం

- ఆగస్టు 15 నుంచి సంపూర్ణంగా అమలు
- దేవదాయ శాఖ మంత్రి రామలింగారెడ్డి



బెంగళూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో ఆగస్టు 15నుంచి ప్లాస్టిక్ కవర్ల నిషేధం సంపూర్ణంగా అమలు చేస్తామని దేవదాయ శాఖ మంత్రి రామలింగారెడ్డి పేర్కొన్నారు. సోమవారం బెంగళూరులో మీడియాతో మాట్లాడిన మంత్రి ఆలయాలకు వచ్చే భక్తులు ఇకపై ఎటువంటి ప్లాస్టిక్ వస్తువులను ఉపయోగించరాదన్నారు. పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మూడు నెలల్లో 1,253 ఆలయాలకు సంబంధించి 11,322 ఆస్తులను గుర్తించామన్నారు. ఇతర రాష్ట్రాల్లో కర్ణాటక భక్తులకోసం వసతి గృహాలను నిర్మించాలని భావిస్తున్నామన్నారు. తిరుపతి గాంధీరోడ్డులో వసతి గృహాలను నిర్మిస్తున్నామన్నారు. అర్చకుల పిల్లలకు స్కాలర్‌షిప్ సౌలభ్యాన్ని అమలు చేస్తున్నామన్నారు. 249మంది విద్యార్థులకు ప్రోత్సాహకవేతనం ఇచ్చామన్నారు. మృతి చెందిన ఏడుగురు అర్చకుల కుటుంబీకులకు రూ.14లక్షలు పరిహారం ఇచ్చామన్నారు.

35 ఏళ్లుగా సెలవు పెట్టని ఉద్యోగి..

- దయానంద్‌కు పెరుగుతున్న మద్దతు
- మంచి అధికారిపై వేటు వేశారని విమర్శలు

బెంగళూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనర్‌గా చిర పరిచితుడై అన్ని వర్గాల ప్రజల అభిమానం చూరగొన్న ఐపీఎస్ అధికారి దయానంద్ క్రమశిక్షణకు మారు పేరు అనేది తెలిసిందే. ఆయన విధి నిర్వహణలో ఇప్పటివరకు దేశవ్యాప్తంగా ఆయన నిబద్ధత ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఐపీఎస్ అధికారిగా విధుల్లోకి చేరి 35ఏళ్లలో ఒక్కరోజు కూడా సెలవు పెట్టలేదని ఆయన స్పష్టం చేశారు. తొక్కిసలాట సంఘటనతో దయానంద్‌పై సస్పెన్షన్ వేటు వేశారు. ఈమేరకు దయానంద్ ఓ మీడియాతో మాట్లాడిన అంశాలు వైరల్ అయ్యాయి. గడిచిన 35ఏళ్ల సర్వీసులో ఒక్కరోజు సెలవు పెట్టలేదని చెప్పుకొన్నారు. పోలీసుశాఖలో ఈ తరహాలో పనిచేశారా లేదా అనేది తెలియదన్నారు. కుటుంబ కార్యక్రమాలకు వెళ్లేవారు కాదని, అందుకే బంధువులు మిత్రులు నన్ను ఆహ్వానించేవారు కాదన్నారు. మంగళూరులో పనిచేస్తున్నప్పుడు నిశ్చితార్థం జరిగేలా పెద్దలు నిర్ణయించారని, అయితే విధి నిర్వహణలో ఆరోజున మంగళూరు విడిచి వెళ్లే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. దీంతో మరుసటి రోజుకు నిశ్చితార్థం వాయిదా వేశారన్నారు. నా పిల్లల నామకరణానికి వెళ్లలేదన్నారు. కమిషనర్ దయానంద్‌పై సస్పెన్షన్ వేటు ప్రభుత్వంపై తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తం అవుతోంది.

ఎమ్మెల్సీ అభ్యర్థులకు అధిష్టానం షాక్..!

- జాబితాను రాజ్‌భవన్‌కు పంపవద్దని ఆదేశం
- చివరి క్షణంలో నిర్ణయంతో ఖంగుతిన్న ఆశావహులు



బెంగళూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): విధానపరిషత్‌లో ఖాళీగా ఉండే నాలుగుస్థానాల భర్తీకోసం సీఎం సిద్దరామయ్య సూచించిన జాబితాకు ఆమోదముద్ర వేసిన అధిష్టానం ఒక్కసారిగా చెక్‌పెట్టింది. రెండురోజులక్రిందటే సిఫారసు చేసిన నలుగురి పేర్లకు అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో సోమవారం పేర్ల నివేదికను పంపి గవర్నర్‌నుంచి ఆమోదం పొందాల్సి ఉండేది. అయితే ఆదివారం అనూహ్యమైన పరిణామాలు చోటు చేసుకున్నాయి. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు అధిష్టానానికి నలుగురిపేర్లపై అభ్యంతరాలు వ్యక్తం చేశారు. దీంతో జాబితాను రాజ్‌భవన్‌కు పంపరాదని పార్టీ హైకమాండ్ ఆదేశించింది.

జాబితాలో ఒకరు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సూచించిన వారు కాగా మిగిలిన ముగ్గురూ సీఎం సిద్దరామయ్యకు ఆప్తులైనవారనేది తెలిసిందే. డీకే శివకుమార్‌తోపాటు ఆయన అనుచరులు జాబితాపై తీవ్రంగా మండిపడ్డారు. ఈలోగానే డీకే శివకుమార్ ఆప్తులు కూడా అధిష్టానానికి ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. మరికొన్ని గంటల్లో రాజ్‌భవన్ నుంచి అనుమతులు వస్తాయని ఎమ్మెల్సీలు కావడం దాదాపు పూర్తయినట్లేనని సంతోషంగా ఉన్నవారికి అధిష్టానం షాక్ ఇచ్చింది. ఎంపిక చేసిన నలుగురిపైనా పలు ఫిర్యాదులు చేసినట్లు తెలుస్తోంది. రమేశ్‌బాబు జేడీఎస్ పార్టీనుంచి ఎమ్మెల్సీగా కొనసాగారని, ఆయనపై పలు కేసులు ఉన్న విషయం కేంద్రమంత్రి కుమారస్వామి ఇటీవల ప్రస్తావించిన విషయం తెలిసిందే. వీటితోపాటు ప్రస్తుతం పార్టీ అధికార ప్రతినిధిగా ఉండగా అదనంగా ఎమ్మెల్సీ ఇవ్వడం పట్ల పార్టీలోని పలువర్గాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ఇక డీజీ సాగర్ కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలు ఏమిటో ఎవరికీ తెలియవని, పదవులు అంటే అందరికీ ఆసక్తేనని, ఆయన పార్టీకోసం చేసిన సేవలను సిఫారసు చేసినవారు చెప్పగలరా అంటూ ఫిర్యాదు చేసినట్టు తెలుస్తోంది. దినేశ్ అమీన్‌మట్టుకు సీనియర్ పాత్రికేయుడిగా పేరున్నా రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గేలను బహిరంగంగా విమర్శించారని ఇటువంటివారికి పదవులు ఎలా కేటాయిస్తారని తెల్పినట్టు సమాచారం. ఇక ఆరతికృష్ణకు ఇప్పటికే పార్టీలో విదేశీ వ్యవహారాల విభాగంలో కీలక పదవి ఇచ్చారని, రాహుల్‌గాంధీ విదేశాలకు వెళ్లినప్పుడు ఆమె పర్యవేక్షిస్తుంటే రాజ్యసభకు పంపడం సముచితమని అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. ఇలా నలుగురిపైనా అభ్యంతరాలు వెల్లువెత్తడంతో జాబితాకు బ్రేక్ పడింది. మరోవైపు సీఎం సిద్దరామయ్యను అధిష్టానం ఢిల్లీకి రమ్మని ఆహ్వానించడం మరో సంచలనం అవుతోంది. మంగళవారం సీఎం ఢిల్లీ వెళ్తున్నారు. రెండు రోజులు అక్కడే గడిపే అవకాశం ఉంది. స్టేడియం వద్ద తొక్కిసలాటతో కాంగ్రెస్ ప్రభుత్వానికి తీవ్రమైన చెడ్డపేరు రావడంతో కాంగ్రెస్ అధిష్టానానికి జాతీయస్థాయిలో విమర్శలు ఎదురవుతున్నాయి. దీంతో సీఎంను ఢిల్లీకి పిలిపించిన తరుణంలో ఏ విధమైన విమర్శలు ఎదుర్కోవాల్సి ఉంటుందోనని ఆయన వర్గీయులు ఉత్కంఠతో ఉన్నారు.

శ్రవణ్ కుటుంబానికి పరిహారం అందజేత

- తొక్కిసలాట మృతుడి కుటుంబ సభ్యులకు రూ.25 లక్షల చెక్కు



చెక్కు అందజేస్తున్న జిల్లా అధికారి రవీంద్ర

చింతామణి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): బెంగళూరు చిన్నస్వామిస్టేడియం వద్ద తొక్కిసలాటలో మృతి చెందిన తాలూకాలోని కురుటహళ్ళికి చెందిన శ్రవణ్ కుటుంబ సభ్యులను చిక్కబళ్లాపుర జిల్లా అధికారి పీఎన్ రవీంద్ర పరామర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రభుత్వ తరపున రూ.25లక్షల చెక్కును అందచేశారు. తొలుత శ్రవణ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం జిల్లా అధికారి మీడియాతో మాట్లాడుతూ తొక్కిసలాట మృతుల కుటుంబాలను పరామర్శించి ప్రభుత్వం తరపున పరిహారం అందచేస్తున్నట్లు తెలిపారు. కాగా గోపల్లికి చెందిన ప్రజ్వల్ కుటుంబం బెంగళూరు యలహంకలో ఉండడంతో ఆ చిరునామాకు చెక్కు అందచేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కేపీసీసీ సభ్యుడు కార్యదర్శి కురుటుహళ్ళి కృష్ణమూర్తి, ప్రగతిపర రైతు రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రూ.16 లక్షలతో ఉడాయించిన ఆర్టీఓ ఉద్యోగి

8

విద్యుత్ తీగలు తగిలి
యువకుడి మృతి

కంప్లీ, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్త హౌసింగ్ బోర్డులో విద్యుత్ తీగలు తాకి యువకుడు మృత్యువాత పడ్డాడు. సోమవారం స్థానికుడు శంకర్ నివాసానికి పెయింటింగ్ పనుల్లో భాగంగా పదో వార్డుకు చెందిన కనకప్ప (26) పెయింటింగ్ పనిచేస్తున్నాడు. పెయింట్ వేస్తుండగా అదుపుతప్పి సమీపంలోని మెయిన్ స్తంభానికి చెందిన విద్యుత్ తీగలు పెయింట్ రోలర్‌కు తగిలాయి. హఠాత్తుగా కనకప్ప స్పృహతప్పి కింద పడ్డాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అప్పటికే చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. కంప్లీ పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గణేష్, తహసీల్దార్ మంజునాయక్, సీఐ వాసు కుమార్, విద్యుత్ శాఖ అధికారులు ఘటనాస్థలానికి చేరుకుని కనకప్పకు నివాళి అర్పించారు.



ఇంటి పక్కనే విద్యుత్ తీగలు, కనకప్ప (ఫైల్)

పశ్చిమ కనుమల్లో ఆగని వర్షం

- బెళగావి సమీపంలో కుంగిన రోడ్డు
- గోవా ప్రయాణానికి బ్రేక్
- నగరంలోనూ వాన జోరు



మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

బెంగళూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పశ్చిమకనుమలలో వర్షాలు ఆగడం లేదు. మలప్రభ నదికి ఇన్‌ఫ్లో పెరిగింది. దీంతో బెళగావి జిల్లా ఖానపుర తాలూకా కడకుంబి వద్ద నీరు పొంగిప్రవహిస్తోంది. కుసుమళి గ్రామం వద్ద నదికి అడ్డంగా బ్రిడ్జ్ నిర్మాణాలు కొనసాగుతున్నాయి. భారీగా నీరు రావడంతో ఇబ్బందికరం ఏర్పడింది. కొంతమేర రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో బెళగావి నుంచి జాంబోటి-చోర్ల మార్గంగా గోవాకు వెళ్లే రహదారి స్తంభించినట్టయ్యింది. పాత బ్రిడ్జ్‌ను తొలగించి కొత్త బ్రిడ్జ్ నిర్మాణాలు చేపడుతున్నారు. నదిలో తాత్కాలికంగా మట్టిరోడ్డును నిర్మించి సంచారానికి అనుకూలం చేశారు. నీరు ఎక్కువగా రావడంతో మట్టిరోడ్డు కొట్టుకుపోయింది. బెళగావి నుంచి గోవాకు ఖానాపుర, రామనగర మార్గంగా మళ్లించారు. మరోవైపు బ్రిడ్జ్ నిర్మాణం పూర్తయ్యేదాకా సమస్య కొనసాగే అవకాశం ఉందని తెలుస్తోంది.

బెంగళూరులో...

బెంగళూరు వ్యాప్తంగా సోమవారం సాయంత్రం ఓ మోస్తరుగా వర్షం కురిసింది. సోమవారం సాయంత్రం వర్షంతో ఉద్యోగులు ఇబ్బందిపడ్డారు. పలుచోట్ల ప్రజలు తడిసిముద్దయ్యారు. విధానసౌధ, ఎంజీ రోడ్డు, ఆర్‌టీనగర్, బళ్ళారిరోడ్డు నగరంలోని దాదాపు అన్ని ప్రాంతాలో వర్షం కురిసింది.



బెళగావి సమీపాన దెబ్బతిన్న తాత్కాలిక రోడ్డు







వర్షంలో ఇబ్బందులు పడుతున్న బెంగళూరు నగర ప్రజలు

బైక్, ప్రైవేట్ బస్సు ఢీ

- దంపతుల దుర్మరణం

చింతామణి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని మురగమల్లా రోడ్డుపై కాగతి గ్రామం వద్ద ప్రైవేట్ బస్సు, బైక్‌ను ఢీ కొన్న ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న దంపతులు అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. ఉదయం సుమారు 11.30 గంటలకు చన్నహళ్ళి నివాసి బిల్డింగ్ కాంట్రాక్టర్ 45ఏళ్ల సీఎన్ చంద్రప్ప, ఆయన భార్య బేబి (40) దంపతులు బైక్‌పై వెళ్తున్నారు. తాలూకాలోని హిరణ్యాహళ్ళిలోని పెద్దకుమార్తె కల్పన ఇంటికి వెళ్లేందుకు పూలు, స్వీట్లు తీసుకుని బైక్‌పై వెళ్తుండగా, మురగమల్లా నుంచి చింతామణికి వస్తున్న బస్సు ఢీ కొంది. ప్రమాదంలో బైక్ అదుపు తప్పడంతో రోడ్డు పడగా వారిపైనుంచి బస్సు చక్రాలు వెళ్లడంతో అక్కడికక్కడే మృత్యువాత చెందారు. సమాచారం అందుకున్న చింతామణి రూరల్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన రెండు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



ప్రమాద స్థలంలో బైక్, మృతదేహాలు

క్రైం కార్నర్

రైలు కింద పడి మహిళ ఆత్మహత్య

గుంతకల్లు టౌన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు- తిమ్మనచెర్ల రైలు మార్గంలో ఆదివారం రాత్రి గుంతకల్లు పట్టణంలోని తిలక్‌నగర్‌కు చెందిన బోయ అనిత(30) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్పీ ఎస్ఐ మహేంద్ర సోమవారం తెలిపారు. అనిత భర్త సుధాకర్ బేల్దారి పని, అనిత కూలి పనులు చేస్తూ జీవించేవారు. సుధాకర్ మద్యానికి బానిసై పనికి వెళ్లే వాడుకాదన్నారు. భార్య కూలి పనులకు వెళ్లి తెచ్చిన డబ్బును సైతం తీసుకుని మద్యం సేవించేవాడన్నారు. దీంతో తన నలుగురు పిల్లలను ఎలా పోషించాలో తెలియక అనిత బాధపడుతుండేదన్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి తిమ్మనచెర్ల రైల్వే స్టేషన్ సమీపంలోని సరస్వతి విద్యామందిరం వద్ద ఉన్న రైల్వే బ్రిడ్జి మీద రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. జీఆర్పీ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ ఎస్ఐ తెలిపారు.

కడుపు నొప్పి తాళలేక డ్రైవర్..


మహబూబ్‌బాషా (ఫైల్)

యాడికి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి తాళలేక మహబూబ్‌బాషా (58) ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం యాడికిలోని ఆంజనేయస్వామికాలనీలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు మహబూబ్‌బాషా సొంత లగేజీ బొలెరో వాహనం బాడుగలకు నడుపుకుంటూ జీవిస్తున్నాడు. కడుపునొప్పితో తరచూ బాధపడుతుండే వాడు. పలు చోట్ల వైద్యం చేయించుకున్నా తగ్గలేదు. దీంతో జీవితం మీద విరక్తి చెంది సోమవారం తెల్లవారుజామున ఇంటిలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య మహబూబ్‌బీ, వివాహితులైన కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం తాడిపత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


శివ మృతదేహం

గుంతకల్లుటౌన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని వైటీచెరువు గ్రామంలో కేసరి శివ(19) సోమవారం ఇంట్లో కరెంట్ షాక్ తగిలి మృతి చెందాడు. పోలీసులు, మృతుడి బంధువులు తెలిపిన మేరకు వెంకటేష్, లక్ష్మీదేవి దంపతులు వ్యవసాయం చేసుకుని జీవించేవారు. వీరికి శివ ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తండ్రి వ్యవసాయ పనుల్లో శివ తోడుగా ఉండేవాడు. మధ్యాహ్నం ఇంట్లో మోటార్‌కు ప్లగ్ పెడుతుండగా షాక్ కొట్టి కిందపడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు శివను గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెంది నట్లు తెలిపారు. ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు బోరున విలపించారు. ఈ సంఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తల్లి, కుమార్తె అదృశ్యం


లేహన్య, అపురూప

కళ్యాణదుర్గం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కురాకులతోట గ్రామానికి చెందిన తల్లీకూతురు అపురూప, లేహన్యా ఈ నెల 6 నుంచి కనిపించడం లేదని బంధువులు సోమవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు అందినట్లు సీఐ యువరాజు తెలిపారు. బంధువుల ఇళ్లల్లోను, చుట్టుపక్కల గ్రామాల్లోను తల్లీకూతురి ఆచూకీ కోసం వారు ప్రయత్నించినా సమాచారం లభ్యం కాలేదన్నారు. దీంతో సోమవారం పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ యువరాజుకు బంధువులు ఫిర్యాదు చేశారు. ఆచూకీ దొరికితే 7386400113, 9490106284 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.

తాడిపత్రిలో బాలుడు..


గణేష్

తాడిపత్రి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టైలర్స్‌కాలనీకి చెందిన మల్లికార్జున కుమారుడు గణేష్ (15) అనే బాలుడు రెండురోజులుగా కనిపించలేదని పట్టణ పోలీసులు తెలిపారు. గణేష్ 9వతరగతి చదువుతున్నాడని, ఇంటివద్ద ఉండకుండా బయటకు ఆటల కోసం వెళుతుంటే తండ్రి మందలించాడు. దీంతో మనస్తాపానికి గురై ఇంటి నుంచి వెళ్లిపోయాడని తండ్రి ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ సాయి ప్రసాద్ తెలిపారు. బాలుడి ఆచూకీ తెలిస్తే 9440796861, 9346917120 నెంబర్లకు ఫోన్‌చేయాలని ఆయన పేర్కొన్నారు.

యాడికిలో యువతి..

యాడికి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని నగరూరు గ్రామానికి చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన యువతి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని పేర్కొన్నారు. బంధువుల ఇళ్ల వద్ద గాలించినా ఆచూకీ లభించలేదని తెలిపారు. యువతి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

ఉరవకొండలో బాలిక..

ఉరవకొండ, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని నెరిమెట్ల గ్రామానికి చెందిన బాలిక (17) నాలుగు రోజుల క్రితం అదృశ్యమయినట్లు తండ్రి సోమవారం ఉరవకొండ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళితే.. విడపనకల్లు మండలం కరకముక్కల గ్రామానికి చెందిన బాలిక తన అవ్వ(అమ్మమ్మ) ఊరు, ఉరవకొండ మండలంలోని నెరిమెట్లకు వెళ్లింది. 6వ తేదీ మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి వస్తానని తన అవ్వకు చెప్పింది. తిరిగి ఇంటికి రాలేదు. పలు చోట్ల వెతికినా ఫలితం లేకపోవటంతో తండ్రి ఉరవకొండ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

మోసగించిన కేసులో యువకుడి అరెస్ట్

కదిరి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): యువతిని మోసం చేసి, ఆమె ఆత్మహత్యకు కారణమైన కేసులో పుట్టపర్తి మండలంలోని దిగువచెర్లోపల్లికి చెందిన ప్రకాష్‌ను సోమవారం అరెస్ట్ చేసినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన మేరకు... కదిరి పట్టణానికి చెందిన యువతిని పెళ్లి చేసుకుంటానని ప్రకాష్ మోసం చేశాడు. దీంతో మనస్తాపం చెందిన ఆ యువతి ఈనెల 3న ఎలుకల మందుతాగి ఆత్మహత్య చేసుకుంది. దీనిపై ఆమె తండ్రి ఫిర్యాదు ఇచ్చారన్నారు. ఈ కేసులు పరారీలో ఉన్న నిందితుడిని సోమవారం అరెస్టు చేసి, కోర్టుకు హాజరు పరచగా, రిమాండ్ విధించినట్లు చెప్పారు.

పురంలో వర్షం

హిందూపురం, జూన్9(ఆంధ్రజ్యోతి): పట్టణంలో సోమవారం సాయంత్రం అరగంటపాటు వర్షం కురిసింది. ఈ వర్షానికి పట్టణంలోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. రైల్వేస్టేషన్ రోడ్డు, బాలాజీ సర్కిల్‌లో మోకాళ్లలోతు నీరు నిలబడ్డాయి. అటువైపు వచ్చే ద్విచక్రవాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షానికి మురుగునీరు, వర్షంనీరు రోడ్డుపైకి చేరాయి.


జలమయమైన రహదారులు

గాలివాన బీభత్సం..

● దెబ్బతిన్న పంటలు ● విరిగిపడిన విద్యుత్ స్తంభాలు ● మునిగిన పంట పొలాలు

● పలుచోట్ల నిలిచిపోయిన రాకపోకలు
● ఉద్యాన రైతులకు భారీ నష్టం


కణేకల్లు వద్ద వేదవతి హగరిలో ప్రవహిస్తున్న వర్షపునీరు

బొమ్మనహాళ్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): గాలివాన బీభత్సం సృష్టించింది. ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులకు అరటి, విద్యుత్ స్తంభాలు, చెట్లు నెలకొరిగాయి. పత్తి పంటలో నీరు చేరి కాయలు రాలి, పత్తి తడిసిపోయింది. బొమ్మనహాళ్ మండలంలోని గోనేహాళ్ గ్రామం వద్ద 10 విద్యుత్ స్తంభాలు ట్రాన్స్‌ఫార్మర్‌తో సహా కూలిపోయాయి. దీంతో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. రాత్రి నుంచి ఉదయం వరకు ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఎల్బీనగర్‌లోని వెంకటరెడ్డికి చెందిన ఆరు ఎకరాల్లో సాగు చేసిన అరటి తోట నెలకొరిగింది. గోనేహాళ్‌క్రాస్‌లో ఇమ్రాన్ అనే వ్యక్తికి చెందిన మెకానిక్ షాప్‌పై చెట్టు పడి బండలు విరిగిపడ్డాయి. మండల కేంద్రంలో 7.2 మి.మీ వర్షపాతం నమోదయింది.

● కణేకల్లు : మండలంలో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో వేదవతి హగరి పొంగిపొర్లింది. ఆదిగానిపల్లి వద్ద పంటపొలాలు నీట మునిగాయి. బోరుబావుల ద్వారా సాగుచేసిన పత్తిపంట నీట మునిగింది. వరదనీరు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన కల్వర్టు మరమ్మతులకు గురవ్వడంతో వర్షపు నీరంతా పొలాల్లో నిలిచిందని సర్పంచ్ రుద్రముని తెలిపారు.

● బెళుగుప్ప : మండలంలో ఆదివారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. వాగులు, వంకలు వర్షపునీటితో పొంగిపొర్లాయి. సేద్యపు పనులు చేయడానికి అనుకూలంగా వుంటుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


బొమ్మనహాళ్ మండలంలో విరిగి పడిన విద్యుత్ స్తంభం


పెద్ద కొట్టాలపల్లి వద్ద వర్షపు నీటితో చెరువును తలపిస్తున్న పొలాలు

26 మండలాల్లో వర్షం

అనంతపురం అర్బన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 26 మండలాల్లో ఆదివారం రాత్రి వర్షం కురిసింది. అత్యధికంగా ఉరవకొండలో 70.6 మీ.మీ. వర్షపాతం నమోదైంది. శెట్టూరు 56.4, ఆత్మకూరు 40.8, బ్రహ్మసముద్రం 40.4, కణేకల్లు 37.4, కళ్యాణదుర్గం 32.2, బెళుగుప్ప 30.4, గుంతకల్లు 23.4, కంబదూరు 22.6, కుందుర్పి 18.6, బుక్కరాయసముద్రం 9.2, బొమ్మనహాల్ 7.2, విడపనకల్లు 4.4, తాడిపత్రి, యల్లనూరు 4.2, పెద్దపప్పూరు 4.0, పామిడి 3.4, గుత్తి 3.2 మీ.మీ వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో 2.8 మీ.మీలోపు వర్షపాతం నమోదయినట్లు అధికారులు తెలిపారు.

● రాయదుర్గంరూరల్ : మండలంలో ఆదివారం రాత్రి మోస్తారు వర్షం కురిసింది. వేపరాల, మల్కాపురం, జుంజురంపల్లి, కదరంపల్లి, రేకులకుంట తదితర గ్రామాలలో వర్షం కురవడంతో వంకలు, వాగులు, చెక్‌డ్యాంలలో నీరు చేరి జలకళ సంతరించుకుంది. వ్యవసాయ పనులను చేసుకునేందుకు అనువుగా ఉంటుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


బొమ్మనహాళ్ మండలంలో నేలకొరిగిన అరటి చెట్లు

● శెట్టూరు : మండల వ్యాప్తంగా ఆదివారం రాత్రి 56.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ ఈశ్వరయ్య శెట్టి తెలిపారు. మృగశిర కార్తి ఆరంభంలోనే మంచి వర్షాలు రావడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వాగులు, వంకలు చిన్నపాటి చెక్‌డ్యామ్‌లలో నీరు చేరింది.

● విడపనకల్లు : మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. పెద్ద కొట్టాలపల్లి వద్ద వర్షపునీటితో పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. వంకలు పొంగిపొర్లాయి. అంచనహాలు-పొలికి గ్రామాల మధ్యలోని పెద్ద వంక ఉధృతంగా ప్రవహించింది. దీంతో అంచనహాలు పొలికి ఉరవకొండ గ్రామాలకు ఉదయం నుంచి సాయంత్రం వరకూ రాక పోకలు నిలిచి పోయాయి. వంక ఉధృతికి అటు వైపు ఎవరూ వెళ్లకుండా రెవెన్యూ అధికారులు పర్యవేక్షణ నిర్వహించారు.

● ఉరవకొండ : పట్టణంలో ఆదివారం అర్ధరాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు పొంగి పొర్లాయి. 76.6మీ.మీ వర్షపాతం నమోదైంది. బూదగవి చెరువులోకి భారీగా వరదనీరు చేరింది. ఉరవకొండలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. డ్రైవర్స్ కాలనీ, హమాలి కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

కుప్పకూలిన బీర పంట

● 80 ఎకరాల్లో పంట ధ్వంసం
● రూ.కోటి వరకు నష్టం

కళ్యాణదుర్గం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): గాలివాన బీభత్సంతో బీర రైతులకు భారీ నష్టం వాటిల్లింది. ఆదివారం అర్ధరాత్రి విపరీతమైన ఈదురు గాలులతో కురిసిన వర్షం ధాటికి పందిరి వేసిన పంట నేలమట్టమయింది. సోమవారం ఉదయం తోటల్లోకి వెళ్లిన చూసిన రైతులు కుప్పకూలిన పంటను చూసి కన్నీటి పర్యంతమయ్యారు. కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం రూరల్ మండలాల్లో సుమారు 80 ఎకరాలకు పైగా బీర పంటను సాగు చేశారు. దాదాపు రూ. కోటి వరకు నష్టం వాటిల్లిందని అంచనా వేస్తున్నారు. రెండు, మూడు రోజుల్లో కోత కోయాల్సిన బీర పంట ఈదురుగాలులకు నేలమట్టమయింది. దీంతో రైతులు భారీగా నష్టపోయారు. కంబదూరు మండలం ఒంటారెడ్డిపల్లి, జెల్లిపల్లిలోనే సుమారు 20 ఎకరాలకు పైబడి 10 మంది రైతులు సాగు చేశారు. ఈ రెండు గ్రామాల్లోనే అత్యధికంగా నష్టపోయారు. జెల్లిపల్లికి చెందిన నూర్ అనే రైతు మాట్లాడుతూ.. నాలుగు ఎకరాల్లో బీర పంటను సాగు చేశానని, సుమారు రూ. 4 లక్షలు ఖర్చు చేశానని తెలిపారు. రెండు రోజుల్లోనే కోత కోయాల్సి ఉండేదన్నారు. పంట అంతా కుప్పకూలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒంటారెడ్డిపల్లికి చెందిన వక్కల రాజు అనే రైతు మాట్లాడుతూ.. తనకున్న రెండున్నర ఎకరాల్లో సాగు చేసిన బీర పంటంతా కుప్పకూలిపోయిందన్నారు. సుమారు రూ. 2 లక్షలు నష్టపోయానని ఆవేదన వ్యక్తం చేశారు.


జెల్లిపల్లి వద్ద నేలకొరిగిన బీర పంటకు వేసిన పందిరి

అత్యాచారాల నివారణకు పటిష్ట చర్యలు ఏవీ..?

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

అనంతపురం కల్చరల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రోజురోజుకీ ఉమ్మడి జిల్లాలో మహిళలపై దాడులు, అత్యాచారాలు, హత్యలు పెరిగిపోతుండటం దురదృష్టకరమన్నారు. నిందితులు మద్యం మత్తులో ఇలాంటి దారుణాలకు ఒడిగడుతున్నారని పేర్కొన్నారు. చిలమత్తూరు మండలంలో అత్తాకోడళ్లపై జరిగిన అత్యాచారం, రామగిరి మండలం మైనర్ బాలికపై సామూహిక అత్యాచారం, అనంతపురం రూరల్ మండలానికి చెందిన బాలిక హత్య జరిగినతీరుతో సభ్యసమాజం తలదించుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఈ ఘటనపట్ల పోలీసులు రాజకీయనాయకులకు దాసోహం కావడం బాధితులకు మరోసారి అన్యాయం చేసినట్లే అవుతుందని విమర్శించారు. మహిళా కమిషన్, రాష్ట్ర ప్రభుత్వం ఈ ఘటనలనై సమగ్రంగా విచారించి, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సావిత్రమ్మ, రామిరెడ్డి, నాగేంద్రకుమార్, శ్రీనివాసులు, కృష్ణమూర్తి, చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ఆశయం

● ప్రాధాన్యాల వారీగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించండి
● జిల్లా అధికారులకు సీఎం ఆదేశాలు

అనంతపురం టౌన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ఆశయమనీ, అందుకు అనుగుణంగా అధికారులు బాధ్యతగా పనిచేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశించారు. ఏడాది పాలన ముగిసిన సందర్భంగా సోమవారం కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులతో సీఎం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఎం మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకే స్వర్ణాంధ్ర విజన్-2047 అమలు చేస్తున్నామన్నారు. ఆ మేరకు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడానికి రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, గ్రామాల వారీగా వేర్వేరు ప్రాధాన్యతలు ఉంటాయన్నారు. ఈ నాలుగురకాల ప్రాధాన్యతలను దృష్టిలో పెట్టుకుని స్వర్ణాంధ్ర విజన్ ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

అనంత జిల్లా ప్రణాళిక వెల్లడి

స్వర్ణాంధ్ర విజన్-2047కు అనుగుణంగా అనంత జిల్లాలో ప్రాధాన్యతల వారీగా ప్రణాళికలు రూపొందించినట్లు సీఎం చంద్రబాబునాయుడుకు కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. సీఎం కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ.. రాయదుర్గం నియోజకవర్గంలో పరిశ్రలు అభివృద్ధి, మైనింగ్, వ్యవసాయం, ఉద్యాన రంగాలకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో హార్టికల్చర్, రెన్యువబుల్ ఎనర్జీ రంగాలు, ఉరవకొండలో నీటిపారుదల, ఉద్యానం, గుంతకల్లులో రైల్వేటూరిజం, అర్బన్ డెవలప్‌మెంట్, వ్యవసాయం, తాడిపత్రిలో పరిశ్రమలు, హార్టికల్చర్, టూరిజం, శింగనమలలో హార్టికల్చర్, రియల్ ఎస్టేట్, రెన్యువబుల్ ఎనర్జీ, అనంతపురం అర్బన్‌లో విద్య, వైద్యం, రాప్తాడులో పరిశ్రమలు, రియల్‌ఎస్టేట్, ఉద్యానరంగాలుకు ప్రాధాన్యమిస్తూ ప్రణాళికలు రూపొందించామని సీఎంకి కలెక్టర్ వినోద్‌కుమార్ వివరించారు. కాన్ఫరెన్స్‌లో వ్యవసాయశాఖజేడీ ఉమామహేశ్వరమ్మ, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ, రాజగోపాల్, హార్టికల్చర్ డీడీ రఘునాథరెడ్డి, ఎల్‌డీఎం శ్రీనివాస్‌యాదవ్, డ్వామా పీడీ సలీంబాషా, జిల్లా వైద్యాధికారి ఈబీ దేవి పాల్గొన్నారు.

గోకులం గోడు..!

● బిడ్డ బంగారం.. బైక్ తాకట్టు పెట్టి కట్టా..
● బిల్లులు ఇంకెప్పుడిస్తారు?
● ఎంపీడీఓ ఎదుట లబ్ధిదారుడి ఆవేదన


ఎంపీడీఓ ఎదుట ఆవేదన వ్యక్తం చేస్తున్న గోకులం షెడ్డు లబ్ధిదారులు

యాడికి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): గోకులం షెడ్ల బిల్లులు అందక లబ్ధిదారుల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. ఒక్కొక్కరిది ఒక్కో వ్యథ. అప్పులు చేసి.. షెడ్లు కట్టుకున్నామనీ, నెలలు గడుస్తున్నా బిల్లులు చెల్లించకపోతే ఎలాగని మండలంలోని నగరూరు గ్రామానికి చెందిన పలువురు గోకులం లబ్ధిదారులు సోమవారం ఎంపీడీఓ వీరరాజు ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. నీలకంఠ అనే గోకులం లబ్ధిదారుడు మాట్లాడుతూ.. గోకులం నిర్మాణం పూర్తయిన వెంటనే బిల్లులు చెల్లిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో అప్పులు చేసి, షెడ్లు కట్టుకున్నామన్నారు. సంక్రాంతి సమయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు ఆర్భాటంగా గోకులం షెడ్లను ప్రారంభించారన్నారు. ఆరునెలలు దాటినా ఇంతవరకు బిల్లులు పడలేదని తెలిపాడు. గోకులం నిర్మాణం కోసం అప్పులు ఇచ్చిన వారి ఒత్తిడి తట్టుకోలేక కూతురి బంగారాన్ని రూ.65వేలకు, బైక్‌ను రూ.35వేలకు తాకట్టు పెట్టాల్సి వచ్చిందన్నాడు. రేకులు అప్పుగా ఇచ్చిన వారు.. వాటిని ఊడదీసుకుపోతామంటున్నారని తెలిపాడు. అదే జరిగితే తనకు ఆత్మహత్యే శరణ్యమని వాపోయాడు. గోకులం షెడ్డు నిర్మాణ పనుల బిల్లులు తక్షణమే అందేలా అధికారులు చర్యలు చేపట్టాలని వినతిపత్రం అందజేశాడు. కార్యక్రమంలో లబ్ధిదారులు హరి, పెద్దన్న, రామాంజనేయులు, పెద్దిరాజు పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


గంగప్ప (ఫైల్)

కుందుర్పి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని జానంపల్లికి చెందిన రైతు గంగప్ప(55) అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ స భ్యులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గంగప్ప తన కున్న నాలుగెకరాల పొలంలో టమోటా, కర్బూజా, పత్తి పంటలను సాగు చేసేవాడు. పంటలు చేతికి రాక నష్టపోయాడు. పెట్టుబడుల కోసం చేసిన అప్పులు పెరిగిపోయాయి. వాటిని తీర్చే మార్గంలేక తీవ్ర ఆవేదన చెందుతుండేవాడు. ఈనేపథ్యంలో వారం రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. బంధువుల ఊరికి వెళ్లి ఉంటాడనుకున్నారు. ఆదివారం సా యంత్రం గ్రామ చివర గుట్ట ప్రాంతంలో దుర్వాసన వస్తుండడాన్ని పశువు ల కాపర్లు గుర్తించారు. అక్కడికెళ్లి చూడగా మృతదేహం చెట్టుకు వేలాడు తూ కనిపించింది. విషయం గ్రామస్థులకు తెలపడంతో వారు వచ్చి చూసి, గంగప్పదిగా గుర్తించారు. ఏఎస్ఐ వెంకటేష్.. రైతు మృతదేహాన్ని పరిశీలించారు. సోమవారం కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గంగప్పకు భార్యలు ఈరక్క, సావిత్రమ్మ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. రైతు బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

చీనీ టన్ను రూ.33 వేలు

అనంతపురం రూరల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్టంగా రూ.33వేలు ధర పలికినట్లు మార్కెట్ ఎంపికశ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్టంగా రూ.3వేలు, సరాసరి రూ.20వేలతో అమ్ముడుపోయినట్లు చెప్పారు. మార్కెట్‌కు మొత్తంగా 845టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

పోలీసుల నిర్లక్ష్యంతోనే తన్మయి హత్య

● వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత


మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం క్రైం, జూన్9(ఆంధ్రజ్యోతి): పోలీసుల నిర్లక్ష్యంతోనే ఇంటర్ విద్యార్థిని తన్మయి హత్య జరిగిందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరలతో మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరాక పోలీస్ వ్యవస్థ నిర్వీర్యం అయిందన్నారు. రాష్ట్రంలో ఏడాది వ్యవధిలో 188మందిపై అత్యాచారాలు జరిగాయన్నారు. అలాగే 15మందిని అత్యాచారం చేసి హత్య చేశారన్నారు. చంబల్‌లోయలో కంటే రాష్ట్రంలో దారుణ పరిస్థితులు ఉన్నాయన్నారు. జిల్లాలో 72 మంది మహిళల మిస్సింగ్ కేసులున్నాయన్నారు. అమ్మాయిలు అదృశ్యమయ్యారని ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు.

వైసీపీ నాయకుల నిరసన

తన్మయి హత్య నేపథ్యంలో విద్యార్థిని కుటుంబసభ్యులతో కలిసి వైసీపీ నేతలు జిల్లా పోలీస్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ విద్యార్థిని హత్యపై ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. నిర్లక్ష్యంతోనే హత్య జరిగిందన్నారు. ముందుగానే అప్రమత్తమై ఉంటే ప్రాణాలు నిలిచేవన్నారు. అనంతరం జిల్లా ఎస్పీ జగదీష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మేయర్ మహమ్మద్ వసీం, మహిళా నాయకులు పాల్గొన్నారు.

మాజీ సైనికుల కోసమే స్పర్శ్ సెంటర్లు

● ఉమ్మడి జిల్లా సైనిక సంక్షేమ అధికారి తిమ్మప్ప

అనంతపురం కల్చరల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యుల సమస్యల పరిష్కారం కోసం స్పర్శ్ కామన్ సర్వీస్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఉమ్మడి జిల్లా సైనిక సంక్షేమ అధికారి తిమ్మప్ప పేర్కొన్నారు. ఆర్డీటీ ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో సోమవారం స్పర్శ్ కామన్ సర్వీస్ సెంటర్ల నిర్వహణపై శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిక్షణను రాష్ట్ర సైనిక సంక్షేమశాఖ డైరెక్టర్ బ్రిగేడియర్ వెంకట్‌రెడ్డి వర్చువల్ కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భంగా తిమ్మప్ప మాట్లాడుతూ మాజీ సైనికులు, సైనిక వితంతువులు, అమర జవాన్‌ల కుటుంబ సభ్యుల పెన్షన్ సమస్యలు, పేర్ల సవరణలు తదితర అంశాల సత్వర పరిష్కారం కోసం స్పర్శ్ కామన్ సర్వీస్ సెంటర్లు పనిచేస్తాయన్నారు. సమస్యల పరిష్కారానికి సెంటర్ల నిర్వాహకులు త్వరితగతిన చర్యలు చేపట్టాలని సూచించారు. శిక్షణా కార్యక్రమంలో అన్ని అంశాలపై శ్రద్ధతో అవగాహన పొందాలన్నారు. అలాగే అన్ని జిల్లాల్లోని మాజీ సైనికులకున్న స్పర్శ్ పెన్షన్ వెబ్ యాప్ సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లాకు చెందిన ట్రైనర్ శ్రీనివాస వరప్రసాద్, లక్ష్మణరావు, రాయలసీమ జిల్లాల స్పర్శ్ కామన్ సర్వీస్ సెంటర్ల నిర్వాహకులు, జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయ సిబ్బంది గిరీష్, బాబా ఫకృద్దీన్, అనీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తిమ్మప్ప

వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్‌పై అవగాహన

సోమందేపల్లి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపల్లి గ్రామంలో రైతు సేవా కేంద్రంలో సోమవారం కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త యుగంధర్ రైతులకు వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ పథకంపై అవగాహన కల్పించారు. వ్యవసాయంలో అధిక మోతాదులో ఉపయోగించే ఎరువులు, మందులను నిర్మూలించి పంట సాగులో నూతన పద్ధతులతో అధిక దిగుబడులు ఎలా సాధించాలో వివరించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా వైవిధ్య పంటల సాగులో మెలకువలను వివరించారు. ఏఓ కవితారాణి, ఉద్యాన అధికారి రాంప్రసాద్, వీఏఏ బాలక్రిష్ణ, వీహెచ్ఏ బాబావలి, జడ్‌పీఎన్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్: రసాయన ఎరువులకు స్వస్తిచెప్పి సేంద్రయ ఎరువులు వాడటంవల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఓ చందన అన్నారు. వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని రాంపురం రైతు సేవా కేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహించారు.


భూసార పత్రాలు చూపుతున్న రైతులు

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కేశ్. శంకరనారాయణ కాయ్...

ఎంఎస్ గోపాలకృష్ణన్ (జయంతి)



'పద్మభూషణ్' గ్రహీత ఎంఎస్ గోపాలకృష్ణన్ 1931 జూన్ 10న చెన్నైలోని మైలాపూర్ ప్రాంతంలో జన్మించారు. కర్ణాటక సంగీతంలో వయోలిన్ కళాకారుడు. లాల్‌గుడి జయరామన్, టీఎన్ కృష్ణన్‌లతో కలసి ముగ్గురూ 'వయోలిన్ త్రయం'గా ఉండేవారు. 8వ యేటనే తొలి ప్రదర్శన ఇచ్చి ప్రశంసలు పొందారు. శ్రీ ద్వారం వెంకటస్వామి నాయుడు నుంచి స్ఫూర్తిగా ముందుకు సాగారు. ఐదు దశాబ్దాలపాటు సంగీత సేవలందించారు. పద్మశ్రీ, కళైమామణి, సంగీత కళానిధి తదితర పురస్కారాలు పొందారు. 2013 జనవరి 3న కన్నుమూశారు.

ఈవీవీ సత్యనారాయణ (జయంతి)



ఈవీవీగా చిరపరిచితులైన ఈదర వీర వెంకట సత్య నారాయణ 1956 జూన్ 10న పశ్చిమ గోదావరి జిల్లా నిడదవోలు మండలం కోరుమామిడి గ్రామంలో జన్మించారు. సినీ దర్శకుడు, స్క్రీన్ రైటర్, నిర్మాతగా రాణించారు. జంధ్యాల శిష్యుడిగా తనదైన గుర్తింపు పొందారు. 51 సినిమాలకు దర్శకత్వం వహించి ప్రధానంగా హాస్యానికి ప్రాధాన్యత ఇచ్చారు. అప్పుల అప్పారావు, సీతారత్నంగారి అబ్బాయి, జంబలకిడిపంబ, అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి, తదితర సినిమాలు ఎంతో పేరొందాయి. 2011 జనవరి 21న కన్నుమూశారు.

పరుచూరి గోపాలకృష్ణ (పుట్టినరోజు)



డాక్టర్ పరుచూరి గోపాలకృష్ణ 1946 జూన్ 10న కృష్ణా జిల్లా పమిడిముక్కల ప్రాంతంలో జన్మించారు. సినిమా రంగంలో స్క్రీన్ రైటర్, కథా రచయిత, మాటల రచయిత, నటుడు, దర్శకుడు, కవి, నాటక రచయిత, నవలా రచయితగా బహుముఖ ప్రజ్ఞాశాలి. సోదరుడు వెంకటేశ్వరరావుతో కలసి పరుచూరి బ్రదర్స్‌గా పేరొందారు. 350కుపైగా సినిమాలకు రచనలు చేశారు. బుల్లితెరపై పలు కార్య క్రమాలకు వ్యాఖ్యాత, సహ వ్యాఖ్యాత, నటుడు, రచయిత, దర్శకుడిగా వ్యవహరించారు. దర్శకత్వం చేసిన తొలి సినిమాకే నంది అవార్డు అందుకున్నా అప్పట్లో ఎన్టీఆర్ సలహాతో రచనా రంగానికే పరిమితమయ్యారు. పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో గౌరవ ప్రొఫెసర్‌గా స్క్రీన్‌ప్లే క్లాసెస్ నిర్వహించారు. పలు పురస్కారాలు అందుకున్నారు.

దేవనూరు మహదేవ (పుట్టినరోజు)



దళిత ఉద్యమనేత దేవనూరు మహదేవ 1948 జూన్ 10న మైసూరు జిల్లా నంజనగూడులో జన్మించారు. కన్నడ సాహిత్య రచయిత, ద్యావనూరు, ఒడలాళ, కుసుమబాలె తదితర రచనలు పేరొందాయి. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత. అధ్యాపక వృత్తికి రాజీనామా చేసి వ్యవసాయం వైపు సాగారు. కర్ణాటక రాజ్యోత్సవ పురస్కారం, పద్మశ్రీతోపాటు పలు అవార్డులు అందుకున్నారు.

ప్రకాశ్ పదుకొనె (పుట్టినరోజు)



'పద్మశ్రీ' గ్రహీత ప్రకాశ్ పదుకొనె 1955 జూన్ 10న బెంగళూరులో జన్మించారు. బ్యాడ్మింటన్ క్రీడాకారుడు. 1980లో వరల్డ్ నెంబరు 1 ర్యాంకుగా నిలిచారు. ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ గెలుపొందిన తొలి భారతీయుడు. తండ్రి రమేశ్ పదుకొనె బాటలో క్రీడల్లో కొనసాగారు. 1978లో కామన్వెల్త్ గేమ్స్ పురుషుల సింగిల్స్‌లో బంగారు పతకం పొందారు. అర్జున అవార్డుతోపాటు పలు గౌరవాలు అందుకున్నారు. గీత్‌సేథితో కలసి ఒలింపిక్ గోల్డ్‌క్వెస్ట్‌ను స్థాపించి క్రీడలను ప్రోత్సహిస్తున్నారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియాకు చైర్మన్‌గా, ఇండియన్ నేషనల్ బ్యాడ్మింటన్ టీమ్‌కు కోచ్‌గా వ్యవహరించారు.

నందమూరి బాలకృష్ణ (పుట్టినరోజు)



నటసార్వభౌమ ఎన్టీఆర్ కుమారుడు నందమూరి బాలకృష్ణ 1960 జూన్ 10న జన్మించారు. తెలుగు సినిమా నటుడు, నిర్మాతగానే కాకుండా ఎమ్మెల్యేగాను రాజకీయాల్లో రాణిస్తున్నారు. 14వ యేటనే 1974లో 'తాతమ్మకల' సినిమాతో వెండితెరకు పరిచయమయ్యారు. తండ్రితో కలసి వైవిధ్యమైన పాత్రల్లో కూడా నటించారు. పౌరాణిక, జానపద, సాంఘిక చిత్రాల్లోనూ తనదైన ముద్రను చాటారు. ఫిలింఫేర్, నంది అవార్డులు అందుకున్నారు. 2014 నుంచి హిందూపురం ఎమ్మెల్యేగా ఉన్నారు. ఇటీవల పద్మభూషణ్ పురస్కారం అందుకున్నారు.

సుందర్ పిచాయ్ (పుట్టినరోజు)



సుందర్ పిచాయ్‌గా చిరపరిచితులైన పిచాయ్ సుందరరాజన్ 1972 జూన్ 10న మద్రాస్‌లో జన్మించారు. ఇంటర్నెట్ దిగ్గజం గూగుల్‌కు మాతృసంస్థ అయిన అల్ఫాబెట్ సంస్థ సీఈఓ. 2004లో గూగుల్ సంస్థలో చేరాక గూగుల్ క్రోమ్, క్రోమ్ ఓఎస్, గూగుల్ డ్రైవ్‌తోపాటు జీమెయిల్, గూగుల్ మ్యాప్స్ వంటివి అభివృద్ధి చేశారు. ఇంటర్నెట్‌లో గూగుల్‌కు తిరుగులేదనేంతగా తీర్చిదిద్దారు. 2016, 2020లలో టైమ్ మ్యాగజైన్ టాప్ 100 జాబితాలో ప్రపంచంలో అత్యంత ప్రభావంతులైన వ్యక్తులలో ఒకరిగా నిలిచారు. 2022లో 'పద్మభూషణ్' పురస్కారం పొందారు.

దేవేంద్ర ఝఝారియా (పుట్టినరోజు)



'పద్మభూషణ్' గ్రహీత దేవేంద్ర ఝఝారియా రాజస్థాన్‌లో 1981 జూన్ 10న జన్మించారు. పారా ఒలింపిక్స్ చరిత్రలో భారత్ తరపున వ్యక్తిగతంగా రెండు స్వర్ణ పతకాలు సాధించిన ఏకైక క్రీడాకారుడిగా తనదైన గుర్తింపు పొందారు. 2004 ఏథెన్స్ పారాఒలింపిక్స్‌లో జావెలిన్ త్రోలో తొలి బంగారు పతకం, 2016 రియో ఒలింపిక్స్‌లో రెండోసారి బంగారుపతకం సాధించారు. 2021లో టోక్యో పారా ఒలింపిక్స్‌లో రజత పతకం సాధించారు. పద్మభూషణ్, పద్మశ్రీ, అర్జున అవార్డు, మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న అవార్డు అందుకున్నారు.

విద్యాశాఖలో వింత నిర్ణయాలు

» ఒక విద్యార్థిని.. ఇద్దరు టీచర్లు..



విద్యార్థిని శివానితో టీచర్ పద్మావతమ్మ



గంగాపురలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

ముళబాగిలు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): విద్యాసంవత్సరం ప్రారంభమై పదిరోజులు అవుతోంది. విద్యాశాఖ ఉన్నతాధికారులు ఏ విధమైన పర్యవేక్షణ చేస్తున్నారు, ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నారనేది సర్వత్రా చర్చనీయాంశం అవుతోంది. ఇటీవలే కోలారు జిల్లా ముళబాగిలులో ఒక విద్యార్థి కోసం ఒక ఉపాధ్యాయుడు పనిచేస్తున్న విషయం వెలుగులోకి వచ్చింది. ఇదే తాలూకాలో మరో వింత అనేలా ఒక విద్యార్థినికి ఇద్దరు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. పీ గంగాపుర ప్రాథమిక పాఠశాలలో మూడో తరగతిలో శివాణి అనే ఏకైక విద్యార్థి ఉన్నారు. పాఠశాలకు హెడ్మాస్టర్‌గా కేఎన్ వాసప్ప, స్కూల్ అసిస్టెంట్‌గా పద్మావతమ్మ సేవలందిస్తున్నారు. గతేడాది నలుగురు విద్యార్థులు చదువుతుండేవారు. వీరిలో ముగ్గురు ఆరో తరగతిలో చేరేందుకు టీసీలు తీసుకెళ్లారు. దీంతో పాఠశాలలో ఏకైక విద్యార్థిని మిగి లింది. గడిచిన రెండేళ్లుగా ఒకటో తరగతిలో కొత్తగా ఒక్కరు కూడా చేరలేదు. దీంతో ప్రస్తుతం ఒక విద్యార్థినికి ఇద్దరు టీచర్లు పని చేసినట్టు అవుతోంది. గ్రామంలో 75 ఇళ్లు, 420మంది జనాభా ఉన్నారు. పాఠశాలలో రెండు తరగతి గదులు, ఒక వంటగది, శౌచాలయం అన్ని వ్యవస్థలు ఉన్నాయి. ఇదే విషయమై బీఈఓ రామచంద్ర అభిప్రాయం మేరకు ఇద్దరు ఉపాధ్యాయులలో ఒకరిని మరో పాఠశాలకు బదిలీ చేస్తామని, ఎట్టి పరిస్థితుల్లోనూ పాఠశాలను మూసివేసేది లేదన్నారు. హెడ్మాస్టర్ వాసప్ప మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి పిల్లలను బడిలో చేర్పాలని సూచిస్తున్నామన్నారు. రెండేళ్లుగా ఒకటో తరగతిలో చేరేవారు ఎవరూ లేరన్నారు.

డిమాండ్ల సాధనకు సీపీఎం పోరుబాట

» పదిరోజులపాటు గ్రామాల్లో చైతన్య కార్యక్రమాలు



సీపీఎం నాయకులు మునివెంకటప్ప తదితరులు

బాగేపల్లి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఖండిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం నిరసన చేపట్టారు. పేదలకు ఇళ్లు, ఇంటిస్థలం, విద్యుత్, విద్య తదితర డిమాండ్ల సాధనకై పదిరోజులపాటు నిరవధిక చైతన్య కార్యక్రమం కొనసాగుతుందని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ మండలి సభ్యుడు మునివెంకటప్ప తెలిపారు. సోమవారం తాలూకా కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. తాలూకాలోని గూళూ రులో ఇందుకు సంబంధించిన ప్రచారం చేపట్టేం దుకు శ్రీకారం చుట్టారు. మునివెంకటప్ప మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పూర్తిగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెప్పినట్టుగా నడుచుకుంటోందని ఆరోపించారు. తద్వారా దేశ సార్వభౌమత్వానికి భంగం కలుగుతోందన్నారు. మే 20న రాష్ట్రప్రభుత్వం రెండేళ్ల సాధనా సమావేశం నిర్వహించిందని, నిరంతం పెట్టుబడి దారులకు అనుగుణంగా పాలసీలు తేవడం ద్వారా వేలాదిమంది ఉద్యోగాలు కోల్పోతున్నా రన్నారు. కాంగ్రెస్ తన ఎన్నికల ప్రచారంలో అధికారంలోకి వస్తే వ్యవసాయ చట్టాలలో మార్పు, బలవంతపు భూస్వాధీనం, బగర్ హుకుం, అటవీసాగు రక్షణకు సంబంధించి రాజ్యాంగబద్ధంగా ఉన్న హక్కులను కాపాడేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చి అమలు చేయలేదని ఆరోపించారు. మతతత్వాన్ని తిరస్కరిస్తామని, రైతుల పంటలకు మద్దతుధర కల్పిస్తామన్న హామీలు అమలు కాలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా హామీల అమలులో విఫలమయ్యారని ఆరోపించారు. సీపీఎం తాలూకా కార్యదర్శి ఎంఎన్ రఘురామ రెడ్డి మాట్లాడుతూ కేఐఏడీబీ అధీనంలో ఉన్న భూమిని ఉపయోగించకుండా, రైతులనుంచి భూములను బలవంతంగా లాక్కునే ప్రయత్నం సరికాదన్నారు. దశాబ్దాలుగా సాగు చేస్తున్న రైతులకు బగర్‌హుకుం, అటవీభూముల రైతులకు భూమి హక్కు కోరుతూ అర్జీలు సమర్పించగా అక్రమ - సక్రమ సమితి ముందుకు తేకుండానే తిరస్కరిం చారన్నారు. బలవంతంగా అన్యాయంగా భూ స్వాధీన ప్రక్రియ చేస్తున్నారన్నారు. ఫలవంత మైన వ్యవసాయ భూమిని రైతులు మిగుల్చు కోవడం కోసం ఆందోళన చెందుతున్నారన్నారు. విద్య, ఆరోగ్యం సహా ప్రజల సౌలభ్యాలను ప్రైవేటీకరణ చేస్తున్నారని ఆరోపించారు. 10 నెలల గెస్ట్ టీచర్ల నియామకానికి పరీక్ష రాయాలని ఆదేశించారన్నారు. కాగా దళితులు, మహిళలు, పిల్లలు, మైనారిటీలపై దౌర్జన్యాలను అరికట్టడంలో విఫలమయ్యారన్నారు. కార్య క్రమంలో సీపీఎం తాలూకా సమితి సభ్యులు డీటీ మునిస్వామి, అశ్వత్థప్ప, జీ కృష్ణప్ప, ముస్తాఫ, సోమశేఖర్, రైతు నాయకులు చన్నరాయప్ప, మునిశ్చంద్ర, రమణ, ఇమ్రాన్, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

కోచిముల్ డైరెక్టర్ అభ్యర్థిగా హునుకుంద వెంకటేశ్



దేవాలయం వద్ద ఎంపీ మల్లేశ్‌బాబు తదితరులు

బంగారపేట, జూన్ 9(ఆంధ్రజ్యోతి): కోచిముల్ డైరెక్టర్‌ల స్థానానికి ఈనెల 25న జరిగి ఎన్నికలకు బంగారపేట తాలూకా ఎన్డీయే అభ్యర్థిగా హునుకుంద వెంకటేశ్‌ను ఎంపిక చేసినట్టు ఎంపీ మల్లేశ్‌బాబు ప్రకటించారు. పట్టణంలోని కోదండరామస్వామి దేవాలయం వద్ద సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కోచిముల్ డైరెక్టర్ స్థానానికి హనుమంతు, చంద్రప్ప, వెంకటేశ్‌లు రేసులో ఉన్నారన్నారు. అయితే సరైన అభ్యర్థిని ఎన్నుకునేలా పార్టీ నిర్ణయించిందన్నారు. జేడీఎస్, బీజేపీలు కలసికట్టుగా ఈ ఎన్నికల్లో గెలుపొందే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. హునుకుంద వెంకటేశ్ గెలుస్తారనే విశ్వాసం వ్యక్తం చేశారు. తాను ఎంపీగా గెలుపొందాక నియోజకవర్గానికి ఏం చేయాలనేది తెలుసుకోవాడానికి సుమారు నాలుగు నెలలు పట్టిందన్నారు. కేంద్రప్రభుత్వం నుంచి కామసముద్ర రైల్వే ఫ్లై ఓవర్ నిర్మాణానికి రూ.28 కోట్లు విడుదల చేయించానన్నారు. మరో రెండు నెలల్లో భూమి పూజ చేసి పనులు చేపడుతున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బీపీ వెంకటమునియప్ప, కోలారు జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి బీవీ మహేశ్, డెలిగేట్ వెంకటేశ్, ప్రముఖులు నటరాజ్, దేవరాజ్, హనుమప్ప, మార్కండయ్యగౌడ తదితరులు పాల్గొన్నారు.

తిమ్మసంద్ర విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ



నోటు పుస్తకాలతో విద్యార్థులు

చింతామణి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నేల, జల, భాష, కళలు సంస్కృతుల పరిరక్షణకోసం కరవే నారాయణగౌడ పుట్టినరోజును అభిమానులు అర్థవంతంగా ఆచరించారు. కరవే చిక్కబళ్లాపుర జిల్లా అధ్యక్షుడు ఎంఆర్ లోకేశ్‌రెడ్డి నేతృత్వంలో పట్టణంలోని 31వ వార్డు తిమ్మసంద్ర ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు, లేఖనా సామగ్రి పంపిణీ చేశారు. గ్రామపెద్దలు లక్ష్మణరెడ్డి, శివణ్ణ, కరవే తాలూకా అధ్యక్షుడు ఎంవీ నారాయణస్వామి, పట్టణ అధ్యక్షుడు షబ్బీర్ అహ్మద్, ప్రధాన కార్యదర్శి టీవీ మంజునాథ్, ఎస్‌డీఎంసీ అధ్యక్షుడు వెంకటేశ్, పాఠశాల ప్రధానోపాధ్యా యురాలు శోభా తదితరులు పాల్గొన్నారు.

బసవాపట్టణలో విద్యార్థులకు పుస్తకాలు..

శిడ్లఘట్ట(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని బసవాపట్టణలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఎమ్మెల్యే రవికుమార్, హెచ్‌డీ దేవేగౌడ అండ్ జయప్రకాశ్ నారాయణ్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, లేఖనా సామగ్రి పంపిణీ చేశారు. గ్రామపంచాయతీ ఉపాధ్యక్షుడు, సభ్యులు, ఎస్‌డీఎంసీ అధ్యక్షులు, గ్రామ పెద్దల సమక్షంలో వితరణ చేశారు. గ్రామ పంచాయతీ ఉపాధ్యక్షురాలు నాగవేణి పిళ్ళేగౌడ, సభ్యులు ఆనంద్, ఉమాదేవి, ఎస్‌డీఎంసీ అధ్యక్షులు రామదాస్, గ్రామ ప్రముఖులు గంగరెడ్డి, నారాయణస్వామి, శ్రీకాంత్, కృష్ణప్ప, మల్లికార్జున్, నారాయణస్వామి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పుస్తకాలతో గ్రామపంచాయతీ సభ్యులు

ఉచిత నేత్ర వైద్యశిబిరం



శిబిరంలో పాల్గొన్న వైద్యులు

విజయపుర, జూన్ 9(ఆంధ్రజ్యోతి): దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణంలోని రోటరీ సంస్థ ఆవరణలో సోమవారం ఉచిత నేత్ర చికిత్సా పరీక్షా, శస్త్ర చికిత్సా శిబిరం నిర్వహించారు. 80మందికిపైగా కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 27మందికి శస్త్ర చికిత్స అవసరమని గుర్తించి బెంగళూరు చామరాజపేట శారదా కంటి ఆసుపత్రికి తరలించారు. నేత్ర నిపుణుడు డాక్టర్ బాబు మాట్లాడుతూ ఇటీవలికాలంలో ఒత్తిడి జీవనం, ఆహారం వల్ల నిత్యం ఆరోగ్యంలో పలు సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ రెండు నెలలకోసారి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతినెలా రెండో సోమవారం ఉచిత నేత్ర పరీక్షా శిబిరం ఉంటుందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రశేఖర్, మహదేవ్, రోటరీ సంస్థ అధ్యక్షుడు మహేశ్, మాజీ అధ్యక్షులు ఏఎం మంజుళ, సూర్యప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

దళిత ఉద్యమ నేతకు నివాళి

బంగారపేట, జూన్ 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దళిత ఉద్యమానికి అడుగులు వేసిన ప్రొఫెసర్ బీ కృష్ణప్పకు ఘనంగా నివాళులు అర్పించారు. పట్టణంలోని అంబేడ్కర్ భవనంలో ఏర్పాటైన 88వ జయంతిలో దళిత సంఘర్ష సమితి రాష్ట్ర సంఘటనా సంచాలకులు సూలికుంటె రమేశ్ నేతృత్వంలో సోమవారం కృష్ణప్ప చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. సూలికుంటె రమేశ్ మాట్లాడుతూ అంబేడ్కర్ మార్గంలో కృష్ణప్ప కూడా సాగారని, రాష్ట్రంలో దళితులపై దౌర్జన్యాలను ఖండిస్తూ 1975లో దళిత సంఘాల ద్వారా పోరాటం చేసి న్యాయం కల్పించడానికి కృషి చేశారన్నారు. ఇటీవలికాలంలో దళిత సముదాయాలు, వెనుకబడినవర్గాల వారు విధానసౌధ ప్రయోజనాలు పొందారన్నారు. సమాజంలో అస్పృశ్యత తొలగాలన్నారు. ఈ సందర్భంగా డీఎస్ఎస్ తాలూకా సంచాలకులు శ్రీనివాస్, దీపణ్ణ, మాటణ్ణ, యల్లప్ప, చంద్రప్ప, వెంకటేశ్, శ్రీనివాస్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రొఫెసర్ కృష్ణప్ప చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న దృశ్యం

ధ్యానంతో ఆరోగ్యం మెరుగు



ప్రసంగిస్తున్న డాక్టర్ సీఎన్ మంజునాథ్

బెంగళూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ధ్యానం, యోగా వంటివి నిరంతరం పాటించడం వల్ల ఆరోగ్యం మెరుగు అవుతుందని బెంగళూరు గ్రామీణ ఎంపీ డాక్టర్ సీఎన్ మంజునాథ్ అభిప్రాయపడ్డారు. కనకపుర రోడ్డు రఘువనహళ్ళి పరిధిలో సర్వదేవ పరమజ్యోతి ధ్యానవిహార ఆధ్యాత్మిక కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ మంజునాథ్ మాట్లాడుతూ ధ్యానంతో మనస్సు ప్రశాంతత సాధ్యమన్నారు. కార్యక్రమంలో ఆలయ కుంభాభిషేకం, హోమం, సర్వదేవ పరమజ్యోతి ప్రతిష్ఠాపన నిర్వహించారు. సామాజిక సేవకురాలు రేవతి కామత్, మైక్రోల్యాబ్స్ ముఖ్యులు ఆనంద్ సురానా, ఎమ్మెల్సీ రవి, ఎమ్మెల్యేలు మంతరగౌడ, కృష్ణప్ప, నటుడు రమేశ్‌భట్, సంగీత దర్శకులు చరణ్‌రాజ్, నటి చందన కృష్ణతోపాటు పలువురు పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

బెంగళూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): అప్పులబాధ భరించలేక ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మైసూరు జిల్లా హుణసూరు హోబళి చిక్కహెజ్జూరుకు చెందిన మహదేవప్ప (69) ఆదివారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పంటలకోసం దొడ్డహెజ్జూరు సొసైటీతోపాటు పలు చోట్ల అప్పులు చేశాడు. ట్రాక్టర్ కూడా ప్రైవేట్ ఫైనాన్స్ ద్వారా తీసుకున్నట్టు తెలుస్తోంది. కంతులు చెల్లించలేకపోవడంతో ఫైనాన్స్ సంస్థ నోటీసు ఇచ్చింది. ఇటీవల వరుస వర్షాలతో చేతికొచ్చిన పంట దెబ్బతినడంతో నష్టపోయాడు. చేసిన అప్పులను తీర్చే మార్గం కనిపించక విరక్తి చెందిన మహదేవప్ప ఆత్మహత్యకు ఒడిగట్టాడు.

రోడ్డును బాగు చేయరూ..



కంకర తేలిన రోడ్డు

చేళూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని చిలకలనేర్పు గ్రామం నుంచి పాల్‌చెరువు మార్గం నుంచి సుమారు నాలుగు కిలోమీటర్ల మేర తారురోడ్డు కంకర తేలింది. దీంతో ఈ మార్గంలో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిలకలనేర్పు నుంచి ఎం నల్లగుట్లపల్లె వరకు రోడ్డు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

అగళి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివి పాఠశాలలకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఎం ఈఓ-2 చంద్రశేఖర్ నాయుడు అన్నారు. మండలంలోని 37 ప్రాథమిక పాఠశాలలకు ముందుగానే పాఠ్య పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని ఎంఈఓ తెలిపారు. ఎంఆర్సీ సిబ్బందితో కలిసి వాహనంలో పాఠ్యపుస్తకాలను ప్రతి పా ఠశాలకు అందజేస్తున్నామన్నారు. 12వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభం అవుతున్న నేపథ్యంలో తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటుచేసి బయోమెట్రిక్ ద్వారా కిట్లను విద్యార్థులకు అందజేయాలని సూచించారు. కిట్లలో నోటుపుస్తకాలు, యూనిఫాం, బూట్లు, తదితర వాటిని అందిస్తామన్నారు. హిందూపురం(రొద్దం): మండలంలో 12వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభం అవుతున్న నేపథ్యంలో పాఠ్యపుస్తకాలను ఆయా పాఠశాలలకు చేరవేశామని ఎమ్మార్సీ సిబ్బంది తెలిపారు. ప్రభుత్వం ముందస్తుగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, బూట్లు, యూనిఫాం, తదితర వాటిని అందించాలని ఆదేశించింది.

బావిలో దూకి మహిళ ఆత్మహత్య

లేపాక్షి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న మహిళ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని తిరుమల దేవరపల్లిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు తిరుమల దేవరపల్లికి చెందిన సునీత(39) అనే మహిళ కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతుండేదన్నారు. పలుచోట్ల పరీక్షలు చేయించినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తిచెంది బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. కుమార్తె మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు. సునీతకు భర్త ఆదినారాయణ, కుమార్తె ఉన్నారు.

ఇంటి పట్టాలివ్వాలని వినతి

గోరంట్ల, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలసముద్రం గ్రామస్థులకు ఇళ్లపట్టాలు, అనుభవ హక్కు పత్రాలను ఇవ్వాలని కార్మిక సంఘం నాయకులు సోమవారం తహసీల్దార్ మారుతికి వినతిపత్రం అందించారు. పట్టాలివ్వాలని పలుమార్లు కోరుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. కార్యదర్శి పెద్దన్న, కొండా వెంకటేష్, స్వర్ణలత పాల్గొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1601.69	1,579.36
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	7,653	2.655
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	213	8
నీటి నిల్వ (టీఎంసీలు)	23.79	4.17

రూ.16 లక్షలతో ఉడాయించిన

ఆర్టీఓ ఉద్యోగి

● పోలీసులకు సిబ్బంది ఫిర్యాదు

బళ్లారి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సొమ్ముతో ఉడాయించిన ఉద్యోగిపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. బళ్లారి ఆర్టీఓ కార్యాలయ ఎస్‌డీఏగా విధులు నిర్వహిస్తున్న రవితవేరా అనే ఉద్యోగి రూ. 16 లక్షల నగదుతో ఉడాయించారని ఆర్టీఓ కార్యాలయ సూపరింటెండెంట్ వీరేష్ సోమవారం కౌల్‌బజార్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్టీఓ కార్యాలయంలో వాహనాల తనిఖీలు, వాహనాల రిజిస్ట్రేషన్ ఫీజులు తదితర వాటికి ప్రజల నుంచి 16 లక్షల 72 వేల 518 వసూలు చేశారు. ఈ డబ్బులను ట్రెజరీలో జమ చేయలేదని ఫిర్యాదు చేశారు. మే 26 నుంచి మే 31 వరకూ వసూళ్ల అయిన మొత్తం ట్రెజరీలో జమచేయలేదని అలాగే మే. 21వ తేదీన మొత్తం కూడా జమచేయకుండా వెల్లడని తెలిపారు. సంబంధిత ఉద్యోగి కోసం ఆర్‌టీవో సూపరింటెండెంట్ వీరేష్ అనేక సార్లు ఫోన్ చేసినా స్విచ్‌ఆఫ్‌లో ఉంది. రవితవేరా ఇంటివద్దకు వెళ్లి విచారించగా రవితవేరా ఇంట్లోనే ఉన్నాడు. డ్యూటీకి రాకపోవడం, సొమ్ము జమచేయకపోవడంపై ప్రశ్నించగా.. సరైన సమాధానం చెప్పలేదు. వారంరోజులు గడువు ఇచ్చినా జమ చేయకపోవడంతోనే పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు అధికారులు తెలిపారు.

12న విద్యుత్ కోత

హోసూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): హోసూరు సబ్ స్టేషన్ జూజువాడి, బేగేపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో అత్యవసర నిర్వహణా పనులు చేపట్టాల్సి ఉన్నందున ఈనెల 12న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుంది. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కుమార్ విడుదల చేసిన ప్రకటనలో ఈనెల 12న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయబడుతుందన్నారు. హోసూరు సబ్‌స్టేషన్ పరిధిలోని టీవీఎస్ నగర్, అందివాడి, మదిరిగి, టైటాన్ టౌన్‌షిప్, కడిపాళ్యం, కుతిరపాళ్యం, వేయనల్లూరు, శివకుమార్ నగర్, కొత్తూరు, కొత్తకొండపల్లి, బొమ్మండపల్లి, మునీశ్వరనగర్, ఆదవన్‌నగర్, ద్వారకానగర్, ఏటీసీఓ, మహాలక్ష్మీనగర్, సెయింట్‌రామ్‌నగర్ తదితర ప్రాంతాలలో విద్యుత్ కోత ఉంటుందన్నారు. ప్రజలు సహకరించాలన్నారు.

ఏఎస్‌ఐ సేవలు అభినందనీయం

సిరుగుప్ప, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఏఎస్‌ఐ మహమ్మద్ యూనిస్ 27 సంవత్సరాల పాటు ఉత్తమ సేవలు అందించారని, ఆయన సేవలు అమోఘమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బీఎం సతీష్ అన్నారు. సిరుగుప్ప తాలుకాలోని అచ్చొళ్లి పోలీస్ స్టేషన్‌లో ఏఎస్‌ఐగా సేవలు అందించి రిటైర్మెంట్ పొందారు. ఈ కారణంగా సిరుగుప్ప పట్టణంలో డబుల్ బాండ్ అబ్దుల్ ఘని ప్లేగ్రౌండ్‌లో పట్టణ ప్రముఖులు ఆయనకు సన్మాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా తాలుకా పంచాయతీ మాజీ అధ్యక్షులు గోపాల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పీరా హుస్సేన్, నగరసభ మాజీ కౌన్సిలర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకటేష్, అబ్దుల్ నబీ, అబ్దుల్ ఘని, పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్యపై మహిళల ఆందోళన

● ఖాళీ బిందెలతో పంచాయతీ కార్యాలయం ముట్టడి ● వారానికోసారైనా నీరు వదల్లేదని ఆగ్రహం



పంచాయతీలో బిందెలతో నిరసన చేపట్టిన హందిహాల్ గ్రామ మహిళలు



పైపుల ద్వారా వచ్చిన కలుషిత నీటిని చూపుతున్న మహిళలు

కంప్లి, జూన్ 9(ఆంధ్రజ్యోతి) : కంప్లి నియోజకవర్గంలో రోజురోజుకి పలు గ్రామాల్లో నీటి సమస్యలు తలెత్తుతున్నాయి. గ్రామాల్లో వుండే అధికారులు గ్రామ పంచాయతీ అధ్యక్షులు నిర్లక్ష్యం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటూ పొరుగు గ్రామాలకు వెళ్లి తీసుకొచ్చుకునే పరిస్థితి ఏర్పడింది. కురుగోడు పరిధిలోని హందిహాళ్ గ్రామంలో గత కొన్ని రోజులుగా నీటి సమస్య ఏర్పడి గ్రామ ప్రజలు తల్లడిల్లుతున్నారు. కానీ గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారి మాత్రం నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని గ్రామప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం గ్రామంలోని మహిళలు గ్రామ పంచాయతీ ఎదురుగా బిందెలతో నిరసన చేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ సభ్యురాలు శాంతి, కేశవ, హేమావతి, షేక్, మాలమ్మ, హనుమంతమ్మ, పార్వతి, షేకమ్మ మాట్లాడుతూ ఈ గ్రామంలో రెండు వేల కుటుంబాలకు పైగా ఉన్నాయి. కానీ గతంలో చెరువులో నీరు గ్రామానికి సప్లై చేపట్టేవారు. చెరువులో నీరు ఖాళీ అయిన వెంటనే గ్రామంలో వుండే బోర్లు ఆర్వో ప్లాంట్ ద్వారా గ్రామంలో నీరిందించేవారు. కానీ బోర్లు చెడిపోయి ఆరవ ప్లాంట్ చెడిపోయి రోజులు గడుస్తున్నా ఇంతవరకు మరమ్మత్తులు చేపించగా అధికారులు వుండిపోయారన్నారు. వెంటనే లీకేజ్ అవుతున్న పైపులు మరమ్మత్తుపనులు ధ్వంసమైన ఆర్‌వో ప్లాంట్‌ని రిపేరీ చేయించి గ్రామానికి సక్రమంగా అందించకపోతే రాస్తారోకో చేపడతామని తెలిపారు.

ఆకుకూరలతో దంతాలకు ఆరోగ్యం

సిరుగుప్ప, జూన్ 9(ఆంధ్రజ్యోతి) : కాయగూరలు తినడం వల్ల దంతాలు ఆరోగ్యంతో గట్టి పడతాయని డెంటల్ వైద్యనిపుణులు డాక్టర్ పవన్ కుమార్ వర్మ తెలిపారు. సోమవారం సిరుగుప్ప పట్టణం ప్రభుత్వాస్పత్రి తాలుకా పరిపాలన డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో డెంటల్ పరీక్ష శిబిర కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన పవన్‌కుమార్ వర్మ మాట్లాడుతూ ప్రతిరోజు దంతాలు శుభ్రం చేసుకోవాలన్నారు. కాయగూరలు తినడం వల్ల పళ్లకు ఎలాంటి హాని కలగదని తెలిపారు. కాయగూరలతో పాటు పండ్లు కూడా తినడం ఆరోగ్యానికి మంచిదని తెలిపారు. అనంతరం రోగులను పరీక్షించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ బసవరాజు, ఉపన్యాసకులు రోగులు పాల్గొన్నారు.



రోగులకు పరీక్షిస్తున్న వైద్యులు పవన్ కుమార్ వర్మ

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం (హోస్పేట), జూన్ 9(ఆంధ్రజ్యోతి) : 2025-26 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాల విభాగాలలో స్పెషల్ రీసోర్స్ టీచర్స్ మొత్తం 20 పోస్టులకు అర్హత కలిగిన ఉపాధ్యాయులను నియమించడానికి ప్రత్యక్ష ఒప్పందం కింద తాత్కాలిక ప్రాతిపదికన అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానించినట్లు పాఠశాల విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేష్ రామచంద్రప్ప తెలిపారు. ప్రీప్రైమరీ డివిజన్ 1 నుండి 5వ తరగతి వరకు, సెకెండరీ విజన్ 6 నుండి 8వ తరగతి వరకు, 9 నుండి 12వ తరగతి వరకు బోధించడానికి ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఆర్‌సీఐలో రిజిస్టర్ చేయబడిన సంస్థల నుండి నిర్దేశించిన విద్యార్హతలను కలిగి వుండాలని, సీఆర్‌ఆర్ నెంబర్ గుర్తింపును కలిగి వుండాలి. దరఖాస్తులను జూన్ 10 నుండి 16 మధ్య పాఠశాల విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎక్స్ ఆఫీషియో జిల్లా ప్రాజెక్టు కోఆర్డినేటర్ సమగ్ర శిక్ష కర్ణాటక, జిల్లా పాఠశాల విద్యాశాఖ కార్యాలయానికి సమర్పించాలన్నారు.

తాళి కట్టబోయి తన్నులు తిన్నాడు..!

● విడాకులు ఇవ్వకుండానే రెండో పెళ్లికి సిద్ధమైన ఘనుడు ● భర్తను చెప్పుతో కొట్టుకుంటూ రచ్చ చేసిన మొదటి భార్య ● పోలీసులకు అప్పగించిన వధువు తల్లిదండ్రులు

బళ్లారి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మొదటి భార్య వుండగానే.. పెళ్లి కాలేదని నమ్మించి మరో యువతితో రెండో పెళ్లికి సిద్ధమయ్యాడు ఆ ఘనుడు. పెళ్లి ముహూర్తం కుదుర్చుకున్నాడు, కల్యాణ వేదికలో పెళ్లి దుస్తులు మార్చుకుని ఇక కొన్ని క్షణాల్లో ఆ యువతి మెడలో మూడు ముళ్లు కట్టాల్సిన సమయంలో మొదటి భార్య వారి అమ్మనాన్న బంధువులతో కల్యాణ వేదిక వద్దకు చేరుకుంది. గదిలో దుస్తులు మార్చుకుని పెళ్లికొడుకుగా ముస్తాబు అవుతున్న వరుడిని చెప్పుతో కొట్టుకుంటూ గదిలో నుంచి కల్యాణవేదిక వద్దకు తీసుకువచ్చింది. ఈ ఘటన చిత్రదుర్గం లోని గాయత్రీ కల్యాణ మంటపంలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు చిక్‌మంగళూరు జిల్లా అరసికెరిలోని తిప్పటట్టుకు చెందిన ఎం. కార్తీక్ నాయక్ దావణగెరె జిల్లా ముస్సేనల్‌కు చెందిన తనూజ అనే మహిళతో ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. కానీ అతను వివాహం కాలేదని నమ్మించి. చిత్రదుర్గంకు చెందిన మరో యువతిని వివాహం



చేసుకునేందుకు సిద్ధమయ్యారు. ఆ యువతి నుంచి రూ.2 లక్షల నగదు, 5 తులాల బంగారు కూడా కట్నంగా తీసుకున్నాడు. వివాహం కూడా కూడా పెళ్లికూతురు వాళ్లే చేసేలా ఒప్పందం చేసుకున్నారు. అంతా సజావుగా సాగిపోతుంది. ఇక కొన్న క్షణాల్లోనే యువతి మెడలో తాళికట్టే సమయంలో మొదటి భార్య కల్యాణవేదిక వద్దకు వచ్చి రెండోపెళ్లికి పెళ్లికొడుకు దుస్తులు, బాషణం, కట్టుకుంటున్న కార్తీక్ నాయక్‌ను భార్య చెప్పుతో కొట్టుకుంటూ పెళ్లి పీటల వరకూ లాక్కొచ్చింది. ఇది చూసి నివ్వెరపోయిన యువతి తల్లిదండ్రులు మోసపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. తొలిభార్య గాయత్రిని కట్నం కోసం వేదిస్తూ ఉండేవాడని గత ఐదేళ్లగా ఇంటికి సరిగ్గారాకుండా బయట బయట ఉండేవాడని మొదటి భార్య తెలిపింది. రెండో పెళ్లికి సిద్ధమైన యవతి తల్లిదండ్రులు కార్తీక్ నాయక్ పై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి పోలీసులకు అప్పగించారు.

హోసూరు జోన్

రోడ్డు పనులకు ఎమ్మెల్యే భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్

హోసూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): హోసూరు నియోజకవర్గంలోని సేవకనపల్లి పంచాయతీ యూనియన్ పరిధిలో రూ.48లక్షలతో సిచురగనపల్లిలో సిమెంట్ రోడ్డు, కోడియాళం గ్రామంలో సిమెంటు రోడ్డు, అంగన్‌వాడీ కేంద్రం, కొత్తపల్లి గ్రామంలో సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే ప్రకాశ్ భూమిపూజ చేసి లాంఛనంగా పనులు ప్రారంభించారు. యూనియన్ కార్యదర్శి గజేంద్రమూర్తి, యూనియన్ కోశాధికారి సంపత్‌కుమార్, శేఖర్, రాజప్ప, సురేందర్, శివకుమార్, డీఎంకే కార్యనిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

రహదారి ఏర్పాటు చేయాలని వినతి

హోసూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఆలూరు పంచాయతీలో వర్షపునీటి పారుదల సౌకర్యంతో రోడ్డు నిర్మాణం చేపట్టాలని న్యూ డెమొక్రటిక్ వర్కర్స్ ఫ్రంట్ డిమాండ్ చేసింది. వతిరపల్లి, కనకండపల్లి, ఆలూరు గ్రామాలలో వెయ్యిమందికిపైగా ఉన్నారు. ఈ గ్రామాలు పూర్తిగా వ్యవసాయంపై ఆధారపడ్డారు. తుమ్మనపల్లి నుంచి ఆలూరు రోడ్డు వరకు రోజువారీ అవసరాలకోసం పెరిగై, బాగలూరు, హోసూరు, బెంగళూరు నగరాలకు ప్రయాణిస్తారన్నారు. ప్రజల సౌకర్యం కోసం సరైన రహదారి, వర్షపునీరు ప్రవహించడానికి వీలుగా సదుపాయం కల్పించాలని కోరారు. రోడ్డుపై వర్షపునీరు నిల్వ లేకుండా సమీపంలోని సర్పులలోకి వెళ్లేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈమేరకు ప్రభుత్వానికి వినతిపత్రాన్ని ఇచ్చినట్టు సంఘం నిర్వాహకులు తెలిపారు.



వినతి పత్రం చూపుతున్న సంఘం సభ్యులు

నదీతీర గ్రామాలను పరిశీలించిన ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం

రాయచూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): భారతీయ సేనకు చెందిన సంజీవ్ ప్రభు ఇతర అధికారుల నేతృత్వంలోని ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం సభ్యులు సోమవారం జిల్లాలోని పలు నది తీర గ్రామాలను పరిశీలించారు. ముఖ్యంగా రాయచూరు, దేవదుర్గ తాలూకాల్లో కృష్ణనది తీరంలో వరద ప్రవాహం పెరిగితే లోతట్టు సమస్యను ఎదుర్కొనే గ్రామాలను అధికారుల బృందం పరిశీలించారు. అనంతరం నగరంలోని అగ్ని మాపక కేంద్రం వద్ద వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. వరద ప్రమాదం ఎదురైన సందర్భంలోను లేదా భారీ వర్షాల వల్ల ఎదురైయ్యే విపత్తులను ఎదుర్కొవడంలో అధికారులు తీసుకోవల్సిన జాగ్రతలు, నివారణ చర్యలు తదితర వాటి గురించి పలు సూచనలు చేశారు.



పరిశీలనకు వచ్చిన ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం

పిడుగు పడి ఎక్స్‌కవేటర్ దగ్ధం



దగ్ధమైన ఎక్స్‌కవేటర్

రాయచూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): రాయచూరు తాలూకాలోని గణమూరు శివారుల్లో రాత్రివేళ ఆపి ఉన్న ఎక్స్‌కవేటర్ ఒకటి అగ్ని ప్రమాదానికి గురైంది. ఆదివారం రాత్రి గ్రామ పరిసరాల్లో వర్షం లేకపోయినా ఈదురు గాలలు మెరుపు ఉరుములు సంభవించిన నేపథ్యంలో పిడుగు పడి యంత్రం కాలిపోయినట్లు గ్రామస్థులు తెలిపారు. యంత్రంపై ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో గ్రామస్థులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా మంటలార్పే ప్రయత్నం చేసేలోగానే యంత్రం పూర్తిగా కాలిపోయినట్లు గ్రామస్థులు తెలిపారు. కాలిపోయిన యంత్రం విలువ దాదాపు రూ.40 లక్షల వరకు ఉంటుందని యజమాని వీరేశ్ అధికారులకు తెలిపారు.

ఆవు మృతి

ఆదివారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి తోడు పిడుగు పడడంతో జిల్లాలోని దేవదుర్గ తాలూకా తాండా వద్ద ఆవు ఒకటి మృత్యువాతపడింది. సంఘటన స్థళాన్ని పరిశీలించిన రెవెన్యూ శాఖ అధికారులు గ్రామ పంచాయతీ అధికారులు తాండా వాసుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విలువైన ఆవు మృతి చెందడంతో రైతు లక్ష్మప్ప తీవ్ర ఆవేదనకు గురి కాగా బాధిత రైతుకు ప్రభుత్వం అందజేయాలని గ్రామస్థులు కోరారు.



ఆవు కళేబరం



సమావేశంలో సంఘ సంస్థల ప్రతినిధులు, పర్యావరణ ప్రేమికులు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

● సదస్సులో కార్యకర్తల అధ్యక్షుడు పన్నరాజు

బళ్లారి సిటీ, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ, అనుసరించాల్సిన చర్యలు తీసుకోవాల్సిన సంకల్పంపై చర్చించడానికి పర్యావరణ ఔత్సాహికులు, కార్యకర్తల సంప్రదింపుల సమావేశం బళ్లారిలో సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో కార్యకర్తల అధ్యక్షుడు పన్నరాజు మాట్లాడుతూ.. మన కోసం మన భవిష్యత్ తరాలకోసం పర్యావరణాన్ని కాపాడుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతను పెంపొందించుకోవాలన్నారు. పాత తరం ఏమి చేసిందో చర్చను పక్కనపెట్టి నేడు మనం ఏమి చేస్తున్నామో సమీక్షించుకోవాలని, పర్యావరణ నష్టం కారణంగా ఇటీవలి రోజుల్లో ప్రజల ఆరోగ్యం ఎదుర్కొంటున్న సమస్యలను అధ్యయనం చేయవలసిన అవసరం ఉన్నారు. డాక్టర్ అరవింద్‌పాటిల్ మాట్లాడుతూ కొప్పళ, బళ్లారిలో ఆస్తమాతో పాటు గ్యాస్ట్రిటీస్ కూడా విస్తృతంగా వ్యాపించింది. ఇటీవలి కాలంలో వంధ్యత్వం పెరుగుతోంది. పిల్లలు చాలా చిన్న వయస్సులోనే తమ రుతుక్రమాన్ని ప్రారంభిస్తున్నారు. ఇవన్నీ పర్యావరణ నష్టంకల్ల కలిగే ప్రభావాలే అని అన్నారు. పర్యావరణంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి



మొక్కలు నాటిన అదానీ ఫౌండేషన్ సభ్యులు

కంప్లి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతిఒక్కరూ ఈ వర్షాకాలంలో తమ ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటి వాతావరణంలో పెరిగిపోతున్నా కాలుష్యాన్ని అరికట్టాలని ఏసీసీ సిమెంట్, అదానీ ఫౌండేషన్ సీఎస్‌ఆర్ మేనేజర్ రిజ్వాన్ తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కుడితిని పట్టణం అనగానే కర్మాగారాల పట్టణమంటారన్నారు. వర్షాకాలంలో మొక్కలు నాటితే పెరుగుదలకు ఎటువంటి ఇబ్బందులు ప్రతి ఒక్కరు మంచి గాలి కోసం మొక్కలు నాటి వాటిని సంరక్షించి పెరిగిపోతున్న కాలుష్యాన్ని అరికట్టేందుకు ముందుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చాముండి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



మారుతినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో...

ఉత్తమ విద్యతోనే ఉత్తమ పౌరులు

● వాల్మీకి సమాజ గురువు ప్రసన్న నందాపురి స్వాములు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రసన్ననందాపురం స్వాములు

కంప్లి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): గ్రామాలు పట్టణాల్లో తల్లిదండ్రులు తమ పిల్లలకు ఉత్తమ విద్య కల్పించి, ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని వాల్మీకి సమాజం గురువులు ప్రసన్న నందాపురి స్వాములు తెలిపారు. సోమవారం కంప్లి పట్టణంలో వాల్మీకి సముదాయ భవనంలో విద్యార్థులకు, ఉద్యోగులకు చేపట్టే సన్మాన కార్యక్రమంలో పాల్గొని తెలిపారు. వాల్మీకి సమాజం ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వాల్మీకి పీఠాధిపతులు ప్రసన్న నందాపురి స్వాములు మాట్లాడుతూ సమాజంలో అన్నిటికన్నా విద్య ఎంతో గొప్పదన్నారు. ప్రభుత్వ విద్యార్థులకు ఇచ్చే సదుపాయాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే సమాజం అభివృద్ధికి ప్రతి ఒక్కరు ముందడుగు వేయాలని తెలిపారు. నూతనంగా ఎన్నికైన సమాజసభ్యులకు అభినందనలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ కంప్లి, కురుగోడు పట్టణంలో వాల్మీకి సమాజ పిల్లలకు రాష్ట్రాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. వాల్మీకి అనగానే రామాయణం గుర్తొస్తుందన్నారు. అధిక మార్కులు సంపాదించిన విద్యార్థులకు ప్రభుత్వ శాఖలో విధులు నిర్వహిస్తున్న వాల్మీకి సమాజం ప్రభుత్వ ఉద్యోగులకు గుర్తించి అభినందించిన ఎంతో సంతోషించదగ్గ విషయమన్నారు. అనంతరం అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో పురసభ అధ్యక్షులు బట్టాప్రసాద్ సమాజం అధ్యక్షులు రిజిస్ట్రార్ అధికారి రామ్మూర్తి నీరుగంటి వీరేష్, నారాయణప్ప, రామాంజనేయ, ఉలగప్ప, వెంకోబ, అంబన్న, ఈరన్న, రామాంజిని, సమాజ పదాధికారులు సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు అనుమతి తప్పనిసరి

విజయనగరం (హోస్పేట), జూన్ 9(ఆంధ్రజ్యోతి): హంపి ప్రపంచ వారసత్వ ప్రదేశం పరిధిలో అనుమతి లేకుండా నిర్మాణాలు, అభివృద్ధి కార్యకలాపాలపై కఠినచర్యలు తీసుకుంటామని హంపి ప్రపంచ వారసత్వ ప్రదేశాల నిర్వహణ అథారిటీ కమీషనర్ తెలిపారు. హంపి యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశం, హంపి ప్రపంచ వారసత్వ ప్రదేశ నిర్వహణ అథారిటీ దాని చారిత్రక, సాంస్కృతిక ప్రాముఖ్యతను కాపాడటానికి నిర్దిష్ట నిబంధనలను అమలు చేసింది. నిబంధనల ప్రకారం, అథారిటీ పరిమితుల్ల ఏదైనా నిర్మాణం, పునర్నిర్మాణం, విస్తరణ, లేదా ఏదైనా అభివృద్ధి కార్యకలాపాలను ప్రారంభించే ముందు అథారిటీ నుండి వ్రాతపూర్వక అనుమతి పొందడం తప్పనిసరి అనుమతి లేకుండా నిర్వహించే ఏదైనా నిర్మాణ పనులను అనధికారికంగా పరిగణించబడతాయి. ఎటువంటి నోటీసులు లేకుండా తొలగించబడతాయి. హంపి ప్రపంచ వారసత్వ ప్రదేశ నిర్వహణ అథారిటీ చట్టం 2002 ఇతర సంబంధితత చట్టాల ప్రకారం అనధికార కార్యకలాపాలలో పాల్గొనే వారిపై తగిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో యాజ్ఞవల్క్య జయంతి

రాయచూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని దేవదుర్గ పట్టణంలో వెంకటవరహప్పయ్య దేవర నివాసంలో యాజ్ఞవల్క్య గురువుల జయంత్యుత్సవాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర స్వామి, ప్రాణదేవరల విగ్రహాలకు ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించి పల్లక్కిలో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో గురువుల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీర్వచనం పొందారు.